ఈనాడు
కాకినాడ
శనివారం సెప్టెంబరు 28, 2024 5



ఆలయాల భూముల చుట్టూ అక్రమార్కులు వాలిపోయారు. దేవుడికి మొక్కి రూ.కోట్ల విలువైన స్థలాలను నొక్కేసే పరిస్థితి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దర్శనమిస్తోంది. అటువంటివారికి రాజకీయం దన్నుగా నిలవడం.. దేవాదాయ శాఖ అధికారులు వంత పాడడం పరిపాటైంది. కీలక దస్త్రాలూ మాయమవుతున్నాయి. న్యాయపరమైన చిక్కులు తెరమీదికి వస్తున్నాయి. రాజుల కాలం నుంచి ఆలయాల ధూప దీప నైవేద్యాలకు నిర్దేశించిన దేవుడి మాన్యానికి.. దాతలు ఉదారతతో రాసిచ్చిన సత్రం భూములకు రక్షణ లేకుండా పోయింది.

- ఈనాడు, కాకినాడ
- న్యూస్‌టుడే, గాంధీనగర్

దేవుడా.. నీ భూమీ వదల్లేదు!

రూ.కోట్ల విలువైన మాన్యం, సత్రం స్థలాలు స్వాహా

కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఆలయాలు, సత్రాలు, మఠాలకు చెందిన రూ.కోట్ల విలువైన భూములు ఉన్నాయి. వీటిలో కొన్ని లీజుల్లో ఉండగా దేవాదాయ శాఖకు వచ్చే ఆదాయం అంతంతే. దశాబ్దాలుగా ఒకరి చేతుల్లోనే ఉండడం.. తక్కువ మొత్తానికి లీజుకు తీసుకుని అధిక మొత్తానికి బయటి వ్యక్తులకు భూములు, భవనాలు లీజుకు ఇవ్వడంపైనా చర్యలు లేవు.

● కాకినాడ జిల్లాలో టైటిల్ వివాదాల్లో 541.17 ఎకరాలు ఉంటే.. కోనసీమలో 366.26 ఎకరాలు, తూర్పు గోదావరిలో 33.57 ఎకరాల దేవాదాయ భూములు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 491 ఆలయాలు, సత్రాల ఆస్తులు 9,997.03 ఎకరాలు ఉంటే.. ఇందులో 1,580.75 ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నాయి.

● అటవీ, కొండ ప్రాంతాల్లోనూ ఆలయ భూములు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 626.87 ఎకరాలు, తూర్పులో 68.99 ఎకరాలు ఉన్నట్లు దస్త్రాల్లో చూపుతున్నా.. వీటిలోనూ ఆక్రమణలే.

● దేవాదాయ శాఖ ఖాళీ భూములు కాకినాడ జిల్లాలో 2.43 లక్షల చదరపు గజాలు, తూర్పులో 4.09 లక్షల చ.గ, అంబేడ్కర్ కోనసీమలో 2.13 లక్షల చ.గ చొప్పున ఉన్నాయి. వీటి నుంచి లీజుల ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం సమకూరే అవకాశమున్నా చొరవ చూపడంలేదు.

ఉమ్మడి జిల్లాలో ఆస్తులు - ఆక్రమణల చిత్రమిదీ..

- ఆలయాలు / సత్రాలు: 1,852
- లీజుకు ఇచ్చినది 20,671.42 ఎకరాలు
- భూములు 38,963.69 ఎకరాలు
- ఆక్రమణలు /వివాదాల్లో ఉన్న భూములు: 5,281.66 ఎకరాలు

ఆక్రమణల చెరలో..

● కాకినాడలోని బొగ్గవరపు సుబ్బారావు సత్రం భూములపై కొందరు కన్నేశారు. సర్పవరంలోని ఎకరం భూమిని కబ్జా చేసేందుకు గత ప్రభుత్వంలో కొందరు ప్రయత్నించారు. న్యాయపరమైన చిక్కులు తెరమీదికి తెచ్చారు. హెచ్చరిక బోర్డులు పెట్టినా రక్షణ లేదు.

● జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలోని పానుగంటి లక్ష్మీ వెంకయ్యమ్మ ధర్మ సత్రానికి 781.53 ఎకరాల భూమి ఉంటే.. 113.37 ఎకరాల్లో న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి. 9.21 ఎకరాలు ఆక్రమణల్లో ఉంది. పరాధీనంలో ఉన్న భూముల విలువ రూ.100 కోట్లకుపైనే.

● గండేపల్లి మండలం తాళ్లూరు వేంకటేశ్వరస్వామి ఆలయానికి 228.46 ఎకరాలు ఉన్నాయి. పుష్కర ఎత్తిపోతల పథకం కాలువ భూసేకరణకు 70 ఎకరాలు పోతే.. 90 ఎకరాలు ఆక్రమణకు గురయ్యింది. అర్చకుల ఆధీనంలో ఉండాల్సిన 60 ఎకరాల సర్వీసు ఇనాం భూమిలో 40 ఎకరాలకుపైగా చేతులు మారింది.



సర్పవరంలో బొగ్గవరపు సత్రం భూమి వద్ద దేవాదాయ శాఖ ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

270 ఎకరాలు స్వాహా..

కాకినాడ గ్రామీణ మండలంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి దేవస్థానానికి 360 ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో అర్చకుల అనుభవంలో 5.42 ఎకరాలు ఉంటే.. 84.50 ఎకరాలు లీజుకు ఇచ్చారు. మిగిలిన 270 ఎకరాల భూమి అన్యాక్రాంతమైంది.. 191.12 ఎకరాల భూములపై నిషేధాజ్ఞలు ఉన్నా.. ఈ భూమి దేవస్థానం ఆధీనంలో లేకపోవడం గమనార్హం. వీటి స్వాధీనానికి రాజకీయం అడ్డొస్తోంది.

ఆక్రమణలు తొలగిస్తాం

ఆలయ భూముల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం.. వాటిని తొలగించి పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. కొత్తగా బాధ్యతలు స్వీకరించాను. మూడు జిల్లాల ఈవోలతోనూ సమీక్షిస్తాను. ఎక్కడెక్కడ ఆక్రమణలు, న్యాయపరమైన సమస్యలు ఉన్నాయో తెలుసుకుంటాను. ఆస్తుల లీజుల పైనా దృష్టిసారిస్తాం.



- డి.ఎల్.వి.రమేష్‌బాబు, డీసీ, దేవాదాయశాఖ

వెంటాడే వరద.. రాకపోకలకు బెడద



పొలాల మధ్యలో రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు

గొల్లప్రోలు జగనన్న కాలనీ వాసులను వరద సమస్య వెంటాడుతూనే ఉంది. కాజ్‌వే పైనుంచి సుద్దగెడ్డ నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో విద్యార్థులు పొలాల మధ్య నీటిలోనే విద్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రవాహం పెరిగితే ఈ రాకపోకలు సైతం కష్టమని.. గతంలో పడవను ఏర్పాటుచేసేవారని తెలిపారు. సూరంపేటకు వెళ్లే మార్గం, తాటిపర్తి వెళ్లే పుంత రోడ్డు వద్ద కూడా ఇదే పరిస్థితి. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

రేబిస్‌పై అవగాహన

మసీదుసెంటర్‌: రేబిస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డా.నరసింహ నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచ రేబిస్ దినం సందర్భంగా శనివారం ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. శుక్రవారం ఉదయం కాకినాడ జీజీహెచ్‌లోని ఎస్‌పీఎం విభాగంలో అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి తెలిపారు.

ముందే మేల్కొంటే.. గర్భాశయ క్యాన్సర్ కట్టడి

పీఐఎన్‌సీసీ భారత ప్రతినిధి డా.సమత కడియాల



న్యూస్‌టుడే, మసీదుసెంటర్(కాకినాడ)

అవగాహన లేమి కారణంగా కొన్ని వ్యాధులు ప్రాణాంతకంగా మారుతున్నాయి. తొలి దశలోనే గుర్తిస్తే నివారించవచ్చు. అలాంటివాటిలో సర్వైకల్(గర్భాశయ) క్యాన్సర్ ఒకటి. కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 23 నుంచి 26 వరకు మహిళలకు నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. అమెరికాకు చెందిన వైద్యులు సేవలందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 350 మందికి పరీక్షలు నిర్వహించగా ప్రాథమికంగా 44 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. పీఐఎన్‌సీసీ(ప్రివెంటింగ్ సర్వైకల్ క్యాన్సర్ గ్లోబల్లీ) భారత ప్రతినిధి డాక్టర్ సమత కడియాల 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.

హెచ్‌పీవీతో వ్యాప్తి..

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) కారణం. లైంగిక చర్యల ద్వారా ఇది వ్యాప్తి చెందుతుంది. ఈ వైరస్ సోకిన 10-15 ఏళ్ల తర్వాత సర్వైకల్ క్యాన్సర్‌గా మారుతోంది. అంతవరకు లక్షణాలు కనిపించవు. ముందే ఒకసారి పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఉనికిని గుర్తించవచ్చు. వెంటనే చికిత్స అందించి పూర్తిగా నయం చేయొచ్చు.

వీఐఏ పరీక్షలతో..

క్యాన్సర్ సంకేతాలను గుర్తించేందుకు విజువల్ ఇన్‌స్పెక్షన్ విత్ ఎసిటిక్ యాసిడ్(వీఐఏ) పరీక్ష చేస్తారు. వైద్యులు ఉంటే థర్మో అబ్లేటర్ పరికరం ద్వారా చికిత్స అందించి ముప్పు తొలగిస్తారు. వీరు మూడేళ్లకు ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి. మొదటి దశలో క్యాన్సర్‌ను నివారించేందుకు వీలుంది. రెండో దశ నుంచి వంద శాతం నివారణ సాధ్యం కాదు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పరీక్షలకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం శిబిరాలు నిర్వహించి సకాలంలో చికిత్స అందించాలి.

నాలుగో వంతు ఇక్కడే.. ప్రపంచంలోని 25 శాతం కేసులు భారత్‌లోనే నమోదవుతున్నాయి. గత మూడు దశాబ్దాల్లో స్వల్ప తగ్గుదల కనిపించినా.. ఏపీతో పాటు కొన్ని రాష్ట్రాల్లో మార్పులేదు. మన దేశంలో ఏటా 1,32,000 కేసులు నమోదవుతున్నాయి. 74వేల మంది మృత్యువాత పడుతున్నారు. పీఐఎన్‌సీసీ ద్వారా ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో శిబిరాలు నిర్వహిస్తున్నాం. సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం.

వాణిజ్య పంటలపై పరిశోధనలకు కార్యాచరణ

రాజమహేంద్రవరం: పొగాకుతోపాటు పసుపు, మిరప, అశ్వగంధ, ఆముదం వంటి వాణిజ్య పంటలపై విస్తృత పరిశోధనలు చేపట్టేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాజమహేంద్రవరం కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(సీటీఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై జాతీయ వాణిజ్య పంటల పరిశోధన సంస్థ(ఎన్ఐఆర్‌సీఏ)- రాష్ట్ర రైతు సాధికార సంస్థ-ప్రకృతి వ్యవసాయ విభాగం(ఏపీసీఎన్ఎఫ్) అవగాహన ఒప్పందం సీటీఆర్ఐలో జరిగింది. డైరెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఎన్ఐఆర్‌సీఏ సహకారంతో మార్కెటింగ్ చేపటేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, అదనపు డీపీఎం షేక్ వలి పాల్గొన్నారు.

ఎక్కడుంది.. ఏమైంది?

వర్షాలతో చిరుత అన్వేషణకు ఆటంకం



కడియం, న్యూస్‌టుడే: కడియం నర్సరీలలోకి చొచ్చుకువచ్చిన చిరుతపులి జాడ నాలుగో రోజు కూడా లభ్యంకాలేదు. మరోవైపు జోరుగా కురుస్తున్న వర్షాలతో అటవీ అధికారుల అన్వేషణకు ఆటంకం కలుగుతోంది. కడియపులంకలోని పలు ప్రాంతాల్లో అమర్చిన ట్రాప్ కెమెరాల్లో శుక్రవారం ఆనవాళ్లు నమోదు కాలేదు. భారీ వర్షం వల్ల చిరుత బయటకు రాకపోయి ఉండవచ్చని సిబ్బంది తెలిపారు. ఇప్పటికే రెండు బోనులు, 20 ట్రాప్ కెమెరాలు, నాలుగు నిఘా కెమెరాలను ఏర్పాటుచేశారు.

వదంతులు నమ్మొద్దు

రాజవోలుకు చెందిన ఓ వ్యక్తి అధికారులకు ఫోన్ చేసి కడియం ఆవలో చిరుత సంచరిస్తుందంటూ సమాచారాన్ని అందించాడు. ఉరుకులు పరుగులు తీసిన అటవీ సిబ్బంది అక్కడ పలు రకాల పాదముద్రలను పరిశీలించారు. ఆలమూరు మండలం చొప్పెల్ల నుంచి ఇదే తరహాలో సమాచారం రావడంతో మరో బృందం అటు వెళ్లింది. పరిశీలించి ఆ ప్రాంతాల్లో చిరుత సంచారం లేదని నిర్ధారించారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఫొటోలు, వీడియోలు చూసి అవి ఈ ప్రాంతంలోనివిగా భావించవద్దని అటవీ అధికారులు తెలిపారు.



నిఘా కెమెరాలలో నమోదైన చిత్రాలను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

గ్రామాల్లో ఆందోళన

కడియం శివారుతో పాటు కడియపులంక, బుర్రిలంక, దోశాలమ్మకాలనీ, వెంకాయమ్మ పేట, పొట్టిలంక, వీరవరం తదితర గ్రామాల్లో చిరుత ఉనికితో ఆందోళన కొనసాగుతోంది. వివిధ పనులపై వెళ్లేవారు రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. ఏడాది పాటు పెంచి పోషించిన నర్సరీలలోని మొక్కలను విక్రయించే సమయమిది. ఈ దశలో చిరుత సంచారంతో వాటి ఎగుమతులు, దిగుమతులు నిలిచాయి. ఇది రైతులపైనే గాక లారీ యజమానులపైనా ఆర్థికంగా ప్రభావం చూపుతోంది.

కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

కాకినాడ నగరం: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందిని ఒప్పంద ప్రాతిపదికన, బోధనేతర సిబ్బందిని పొరుగు సేవల విధానంలో ఏడాది కాలానికి నియమించేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లాలో పీజీటీ 4, పార్టుటైం టీచర్లు 2, వార్డెన్ 1, అకౌంటెంట్ 1 చొప్పున 8 ఖాళీలు ఉన్నాయని డీఈవో పి.రమేష్ తెలిపారు. apkgbv.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో రూ.250 రుసుం చెల్లించి అక్టోబరు 10 ఉదయం 11.59లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సర్వేశాఖ ఏడీ బాధ్యతల స్వీకరణ

కాకినాడ కలెక్టరేట్: సర్వే, ల్యాండ్ రికార్డ్సు జిల్లా సహాయ సంచాలకుడిగా నియమితులైన కట్టా శ్రీనివాస్ శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆ శాఖ ఏడీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎన్టీఆర్ జిల్లాలో సహాయ సంచాలకుడిగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

● పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరుగా దేవుల నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన శ్రీకాకుళం జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎంగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి డీఎంగా ఉన్న ఎం.బాల సరస్వతి ఇక్కడే అసిస్టెంట్ మేనేజరు(అకౌంట్స్)గా కొనసాగనున్నారు.

జడ్పీ సీఈవో లక్ష్మణరావు..

కాకినాడ నగరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్తు(జడ్పీ) ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈవో)గా వీవీవీఎస్ లక్ష్మణరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పి.నారాయణమూర్తి ఇన్‌ఛార్జి సీఈవోగా వ్యవహరించారు. విశాఖపట్నం జిల్లా గరివిడి క్లస్టర్‌లో డ్వామా ఏపీడీగా పనిచేస్తూ లక్ష్మణరావు జిల్లాకు బదిలీపై వచ్చారు. సీఈవోను నారాయణమూర్తితో పాటు పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, కార్యాలయ పర్యవేక్షకులు, ఏవోలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మెట్టలో సాగుకు సౌర విద్యుత్తు

● ఈ ఏడాది 5 ఫీడర్ల ఎంపిక
● ఫలకాల ఏర్పాటుకు భూమి పరిశీలన

డివిజన్	కనెక్షన్లు
జగ్గంపేట	16,965
పెద్దాపురం	3,779
కాకినాడ	3,510

సోలార్ ఫీడర్ల ఏర్పాటు ఇలా..

ఏడాది	లక్ష్యం
2024-25	5
2025-26	3

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

వ్యవసాయ కనెక్షన్లకు సౌర విద్యుత్తు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటి వరకు రైతులు మోటార్ల వద్దనే సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకున్నారు. తాజాగా ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ఫీడర్ల స్థాయిలో సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసి సరఫరా చేయనున్నారు. దీనికి తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) ముమ్మర కసరత్తు చేస్తోంది. దీని ద్వారా పూర్తిగా పగటి పూట రైతులకు విద్యుత్తు అందనుంది.



వ్యవసాయ ఫీడర్

జిల్లాలో ఇలా..

జిల్లాలో 127 ఫీడర్లపై 24,254 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. మెట్టప్రాంతాలైన ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం మండలాల్లో వీటి ఏర్పాటుకు సంకల్పించారు. కేంద్ర ప్రభుత్వమే సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయనుంది. ప్రభుత్వ భూమి అందుబాటులో లేకుంటే ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకుంటారు. ఏడాదికి రూ.30 వేలు చొప్పున ప్రభుత్వం ఆ రైతులకు లీజు చెల్లిస్తుంది. రెండేళ్లకు ఒకసారి లీజు ధర పెంచుతారు. దీనిపై ఏపీఈపీడీసీఎల్ జిల్లా నోడల్ అధికారి ఎన్.ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. వ్యవసాయ ఫీడర్ల సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు స్థలాలు చూస్తున్నామన్నారు. ఈ ఏడాది లక్ష్యాలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

సామర్థ్యం (మెగావాట్‌లు)	భూమి (ఎకరాల్లో)	ఖర్చు (కోట్లలో)
0.5	2	2
1.0	4	4

గంజాయి రవాణా అరికట్టేందుకు కార్యాచరణ



వార్షిక తనిఖీల్లో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: గంజాయి రవాణా, అమ్మకాలు అరికట్టడానికి ప్రత్యేక శ్రద్ధ, కార్యాచరణ రూపొందిస్తున్నామని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. ఏజన్సీ ప్రాంతాల నుంచి వచ్చే నేరస్థులు తుని, సామర్లకోట రైల్వే జంక్షన్‌లను షెల్టర్ ప్రాంతంగా ఉపయోగించుకుంటున్నారని, ప్రత్యేక నిఘాతో చాలా మందిని పట్టుకున్నామని అన్నారు. తిమ్మాపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా వచ్చిన ఆయన మాట్లాడారు. ఈ స్టేషన్ పరిధిలో హైవేలు ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, బ్లాక్ స్పాట్‌లు గుర్తించి ప్రమాదాలు తగ్గించే చర్యలు తీసుకుంటామని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో హద్దుమీరి ప్రవర్తించొద్దని హెచ్చరించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ రఘువీర్‌విష్ణు, గ్రామీణ సీఐ చైతన్య కృష్ణ, తిమ్మాపురం ఎస్సై ఎంవీవీ రవీంద్ర బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టెట్ నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)-2024కు జిల్లాలో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. వచ్చేనెల 3 నుంచి 21 వరకు ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలో 21,471 మంది హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థులు తాజా పాస్‌పోర్టు సైజ్ ఫొటో, గుర్తింపుకార్డుతో హాజరుకావాలని కోరారు. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా విద్యుత్తు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాలున్న ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. డీఆర్వో డి.తిప్పేనాయక్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న జేసీ రాహుల్‌మీనా, హాజరైన అధికారులు

విద్యుత్తుశాఖ కొత్త సర్కిల్ ప్రారంభం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) కాకినాడ జిల్లా కొత్త సర్కిల్ కార్యాలయం ప్రారంభమైంది. శుక్రవారం నుంచి కాకినాడలో ఈ శాఖ డివిజనల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగం నుంచి అధికారులు కార్యకలాపాలు ప్రారంభించారు. సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు(ఎస్ఈ)గా జి.ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు(ఈఈ-టెక్నికల్)గా పి.ఉషారాణి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా కె.ఆదినారాయణమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఈ జి.ప్రసాద్‌కు కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎన్.ఉదయ్‌భాస్కర్, ఎ.ప్రభాకర్, డి.వీరభద్రరావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్ఈ ప్రసాద్ మాట్లాడుతూ కొత్త సర్కిల్ ఏర్పాటు ద్వారా పరిపాలనా సౌలభ్యం ఉంటుందన్నారు.



ఎస్ఈ జి.ప్రసాద్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న విద్యుత్తు అధికారులు

మందులకైనా డబ్బులు ఇప్పించండి

జయలక్ష్మి ఎంఎం కోఆపరేటివ్ సొసైటీ మహాజన సభలో బాధితులు

గాంధీనగర్, సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కనీసం మందులు కొనుక్కునేందుకైనా డబ్బులు ఇప్పించాలని ఒకరు.. కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న డబ్బులు పోయాయి. అప్పు చేసి వివాహం చేశాం.. వాటికి వడ్డీ చెల్లించేందుకైనా కొంత సొమ్ము వచ్చేలా చూడాలని మరొకరు.. జయలక్ష్మి ఎంఎం కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ మహాజన సభలో తమ ఆవేదన వినిపించారు. సొసైటీ మహాజన సభ శుక్రవారం దంటు కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్మానాలు ప్రవేశపెట్టిన సమయంలో పలువురు సభ్యులు వాటిని ఆక్షేపిస్తూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. కొద్దిసేపు గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అనంతరం సొసైటీ తరఫున ప్రభుత్వం, కోర్టు, రుణగ్రహీతలపై జరిపే లావాదేవీలన్నీ పాలకవర్గ సభ్యులకు అప్పగిస్తూ సభ్యులు తీర్మానంలో ఆమోదించారు. సొసైటీ ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు మాట్లాడుతూ రూ.500 కోట్ల రుణాలు తీసుకుని చెల్లించని వారి ఆస్తులను సీబీసీఐడీ జప్తు చేసిందన్నారు. కోర్టు నుంచి సేల్ ఆర్డర్ వచ్చిన తర్వాత వాటిని విక్రయించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. మొత్తం రూ.700 కోట్ల స్కాం జరిగిందన్నారు. సొసైటీకి తనఖా పెట్టిన ఆస్తుల విలువ రూ.497 కోట్ల వరకు ఉంటుందన్నారు. సుమారు రూ.1000 కోట్లు వరకు రానున్న నేపథ్యంలో బాధితులెవ్వరూ అధైర్య పడవద్దన్నారు. డిసెంబరు నాటికి రూ.50 కోట్లు బాధితులకు అందజేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 70 మంది బాధితులు మృతి చెందారన్నారు. ఈ కుంభకోణం విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి వివరించామన్నారు. ప్రభుత్వం నుంచి సొసైటీకి రూ.200 కోట్ల రుణంగా ఇవ్వాలని కోరామన్నారు. తమ పాలకవర్గంపై కొందరు సభ్యులు విష ప్రచారం చేస్తున్నారన్నారు. సమావేశంలో డైరెక్టర్లు, ఉమ్మడి గోదావరి జిల్లాలు, విశాఖపట్నానికి చెందిన సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు

కాకినాడను ముంచెత్తిన వాన



కాకినాడ లక్ష్మీనారాయణ నగర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు



వర్షపు నీటిలో వాహనాల రాకపోకలు

కాకినాడ నగరాన్ని వాన ముంచెత్తింది. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు వర్షం కురిసింది. డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. రహదారులపై గంటల తరబడి నీరు నిలిచిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు 5.4 సెం.మీ వర్షపాతం నమోదైంది.

-న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్, సాంబమూర్తినగర్

వంతెనలో ఇరుక్కున్న పడవ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: ఏలేరు ప్రాజెక్టు నుంచి దిగువకు భారీగా నీరు విడుదల చేయడంతో కాలువలు ఉద్ధృతంగా పారుతున్నాయి. రామకృష్ణాపురంలో ఒడ్డున ఉన్న పడవ వరద ధాటికి కొట్టుకొచ్చి రాజుపాలెం, ముక్కొల్లు గ్రామాల మధ్య వాలు కాలువలో వంతెన వద్ద ఇరుక్కుపోయింది. ఇటీవల వరదలకు వంతెన వద్ద ముక్కొల్లు వైపు గట్టు పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ పరిస్థితుల్లో వరద మళ్లీ అటు వైపునకే మళ్లడంతో రాజుపాలెం, రామకృష్ణాపురం గ్రామాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. బోటును జేసీబీ సహాయంతో తొలగించారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



జేసీబీతో పడవ తొలగింపు (అంతర చిత్రంలో) వంతెన కానులకు అడ్డుగా పడవ

ఏలేశ్వరం: ఏలేరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి శుక్రవారం 4,814 క్యూసెక్కుల వంతున నీరు చేరుతోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి సామర్థ్యం 86.56 మీటర్లు (24.11). ప్రస్తుతం రిజర్వాయర్‌లో 85.64 మీటర్ల స్థాయిలో 22.24 టీఎంసీల నిల్వలున్నాయని ఏఈఈ వి.పట్టాభిరామయ్య చౌదరి తెలిపారు. రెండు గేట్లను ఎత్తి దిగువకు 5100 క్యూసెక్కులు విడిచిపెడుతున్నారు.

పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్



సర్పవరం జంక్షన్: కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ రవాణా, సంస్కృతి, పర్యాటకశాఖల పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు వెలువరించింది. రాజ్యసభ ఎంపీ సంజయ్ కుమార్ ఝా ఛైర్మన్‌గా వ్యవహరించనున్న ఈ కమిటీలో ఇరు సభలకు చెందిన 31 మంది ఎంపీలు ఉంటారు. లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది ప్రాతినిధ్యం వహిస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచి చోటు దక్కించుకున్న ఏకైక ఎంపీ కావడం విశేషం. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక పార్లమెంటరీ కమిటీలో సభ్యుడిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ సూచనలతో రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

వైకాపా జిల్లా అధ్యక్షుడిగా కన్నబాబు



సర్పవరం జంక్షన్: కాకినాడ జిల్లా వైకాపా అధ్యక్షుడిగా గ్రామీణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కురసాల కన్నబాబును నియమించారు. శుక్రవారం తాడేపల్లి వైకాపా కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం జగన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం కన్నబాబు జిల్లా అధ్యక్షుడిగా ఉండగా మరోసారి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా కన్నబాబుకు పలువురు అభినందనలు తెలిపారు.

పురపాలక సంఘాలకు ఆదాయ వనరు

బీపీఎస్ అమలుపై దృష్టి

పెద్దాపురం, సామర్లకోట, న్యూస్‌టుడే: పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తి పన్ను. గృహాలు, భవనాలు, వాణిజ్య సముదాయాల నుంచి వచ్చే పన్నులే స్థానిక సంస్థల మనుగడకు ఆధారం. అలాంటి ఆదాయాలను పెంచుకునే మార్గాల్లో ప్రధానమైంది భవనాల క్రమబద్ధీకరణ (బీపీఎస్) పథకం. 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఈ జీవో ద్వారా పట్టణ ప్రాంతాల్లో అనుమతులు లేని, అక్రమ భవనాలను అపరాధ రుసుం విధించి వాటిని క్రమబద్ధీకరించడం ద్వారా పురపాలక సంఘాలకు రూ.కోట్లలో ఆదాయం వచ్చింది. ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనిపై ఏమాత్రం దృష్టి సారించలేదు. ఫలితంగా స్థానిక సంస్థలకు జమకావాల్సిన రూ.కోట్లలో ఆదాయం వెనక్కి మళ్లింది. కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, తుని, సామర్లకోట, పిఠాపురం పురపాలక సంఘాల్లో దాదాపు గత ఐదేళ్లలో సుమారు 3,500 భవన నిర్మాణాలకు అనుమతులు జారీచేశారు. ఇందులో సుమారు 1,070 వరకు భవనాలు అనుమతులకు విరుద్ధంగా నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. వీటిని క్రమబద్ధీకరించడం ద్వారా ఆయా పురపాలక సంఘాలకు సుమారు రూ. 12 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అధికారులు అంచనావేశారు. తద్వారా పట్టణాల్లో ఆయా కట్టడాల యజమానులు మొదటి, ఇతర అంతస్తుల నిర్మాణాలు చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది. క్రమబద్ధీకరణ చేసుకోకుంటే వైఫల్యాలు చేస్తున్నవారికి పురపాలక సంఘాల అనుమతులు జారీచేయవు. ఈ కారణంగా తప్పనిసరిగా భవన యజమానులు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలోని పురపాలక సంఘాల్లో 2019 నుంచి 2024 వరకు అనుమతులు ఇచ్చిన భవనాల వివరాలు.



పెద్దాపురం పట్టణం

మున్సిపాలిటీ	అనుమతులు	విరుద్ధంగా ఉన్నవి	ఆదాయం (రూ.కోట్లలో)
పెద్దాపురం	900	300	3.5
తుని	800	200	3
పిఠాపురం	950	250	2.7
సామర్లకోట	850	320	2.8


క్రమబద్ధీకరణకు రంగం సిద్ధం..

భవనాల క్రమబద్ధీకరణ జీవో గతంలోనే జారీ అయింది. దీని అమలుతో పురపాలక సంఘాలకు ఆదాయం సమకూరింది. పురపాలక సంఘాలు జారీచేసిన అనుమతులకు విరుద్ధంగా కొన్ని భవన నిర్మాణాలు జరుగుతాయి. అలాంటి వాటిని అపరాధ రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి. ఈ జీవోపై ఆదేశాలు రాగానే పర్యవేక్షణలో అమలు చేయడానికి వెంటనే చర్యలు చేపడతాం.

- కేవీపద్మావతి, పెద్దాపురం, శ్రీవిద్య, సామర్లకోట, మున్సిపల్ కమిషనర్లు

అణువు సమర్థ వినియోగంతోనే దేశాభివృద్ధి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: అణువును సమర్థవంతంగా వినియోగించుకోగలిగితేనే దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తుందని విశాఖ బాబా ఆటమిక్ రీసెర్చి సెంటర్ (బార్క్) శాస్త్రవేత్త ఎంవీ సూర్యనారాయణ అన్నారు. ఆరోగ్య రక్షణ, పర్యావరణంలో అణుశాస్త్ర విజ్ఞానం అనే అంశంపై శుక్రవారం ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సదస్సు జరిగింది. కళాశాల భౌతిక, రసాయన, గణిత శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో బార్క్ సౌజన్యంతో ఏర్పాటైన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అణువు ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ జపాన్ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మారిందన్నారు. వ్యవసాయ రంగంలో అధిక ఉత్పత్తులు సాధించడం, ఔషధాల తయారీలో న్యూక్లియర్ విజ్ఞానం ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ప్రపంచాన్ని వణికిస్తున్న క్యాన్సర్ వ్యాధిని గుర్తించడంలో న్యూక్లియర్ సైన్స్ కీలక పాత్ర అన్నారు. శాస్త్రవేత్తలు రామచంద్ర, జగన్నాధరావు, గౌరీ శంకర్ మాట్లాడుతూ.. న్యూక్లియర్ సైన్స్ ఉపయోగాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డి.సునీత, ఎన్ఎస్ఎస్ పీవో ప్రగడ ప్రసాదమూర్తి మాట్లాడుతూ.. సదస్సును ఇక్కడ ఏర్పాటుచేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డి.వెన్నెరావు, అధ్యాపకులు కె.విజయలక్ష్మీ తదితరులు పాల్గొని ఉపన్యసించారు.



మాట్లాడుతున్న సూర్యనారాయణ

రైల్వేస్టేషన్‌లో పనుల పరిశీలన

సామర్లకోట, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతాలోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని రైల్వే డివిజన్ ఎలక్ట్రికల్ సర్వీస్ ఇంజినీర్ మోహన్‌మీనా అన్నారు. శుక్రవారం సామర్లకోట జంక్షన్ విచ్చేసిన ఆయన స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలను పరిశీలించారు. స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీచేశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తేదారులకు పలు సూచనలు చేశారు. స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, సీనియర్ సంతోష్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మోహన్‌మీనా



విజేతలను అభినందిస్తున్న నరసింహారావు

ఖోఖో జాతీయ పోటీలకు ఎంపిక

తుని: సీబీఎస్ఈ బోర్డు ఆధ్వర్యంలో జోనల్ స్థాయిలో నిర్వహించిన క్లస్టర్ -7 (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) ఖోఖో పోటీల్లో తమ విద్యార్థులు సత్తాచాటారని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ప్రిన్సిపల్ తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో లాలం పూర్ణ శ్యామ్ నాయుడు బృందం, అండర్-19లో జి.తరుష్ బృందం ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారన్నారు. దీంతో మధ్యప్రదేశ్‌లోని దేవాస్‌లో అక్టోబరు 16-19 వరకు జరిగే జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్ -14 బాలికల విభాగంలో జి.కావ్యసహ బృందం తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం కైవసం చేసుకున్నారన్నారు. ప్రతిభచూపిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, కోచ్‌లు చిరంజీవి, హేమ తదితరులు అభినందించారు.



ఎమ్మెల్యే దాట్లకు నగదు అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

వరద బాధితులకు రూ.5 లక్షల సాయం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్, క్లబ్ పూర్వపు గవర్నర్ బాదం బాలకృష్ణ సమక్షంలో లయన్స్ క్లబ్‌ల ప్రతినిధుల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుంకరపాలెం గోల్డ్, యానాం, పిఠాపురం, కనకాల పేట, అమలాపురం, వశిష్ఠ లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు సహాయార్థం సమకూర్చిన రూ.5 లక్షల నగదును ఎమ్మెల్యే బుచ్చిబాబుకు అందించారు. వారిని ఆయన అభినందించారు. క్లబ్‌ల ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, వినోద్, శ్రీనివాసరెడ్డి, వెంకటరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

రాయవరం: రాయవరంలో 85 సంవత్సరాల వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 11 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో న్యాయస్థానం, క్రైమ్ అగైనెస్ట్ విమెన్ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు. మండపేట గ్రామీణ సీఐ పి.దొరరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం 5 గంటల ప్రాంతంలో 85 ఏళ్ల వృద్ధురాలిపై లారీ క్లీనర్‌గా పని చేస్తున్న కంచు మండలానికి చెందిన నొక్కు వెంకటరమణ అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. వృద్ధురాలి అరుపులకు సమీప ఇంటి యజమాని, అతని భార్య అక్కడకు చేరుకుని నిందితుడిని పట్టుకుని రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అప్పటి ఎస్సై పీఎస్ఎస్ఎన్ సురేష్ కేసు నమోదు చేయగా, సీఐ గోవిందరావు దర్యాప్తు చేశారన్నారు. కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు వెంకటరమణకు పది సంవత్సరాల కఠిన కారాగారం, ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.ఐదువేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారన్నారు. కేసు దర్యాప్తు చేసిన ఎస్సైలు పీఎస్ఎస్ఎన్ సురేష్, పి.శివగణేష్, సిబ్బందిని జిల్లా ఎస్పీ కృష్ణారావు అభినందించారని సీఐ తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాల్)		ధర (రూపాయల్లో)
కొత్తకొబ్బరి	గరిష్ఠ	12,500
పాతకాయ	గరిష్ఠ	18,000
	కనిష్ఠ	15,000
కొత్తకాయ	గరిష్ఠ	17,500
	కనిష్ఠ	14,500
నీటి కాయ (వెయ్యింటి) పాత		17,000-18,000
కొత్త		17,000-17,500
కొబ్బరినూనె (15 కిలోల డబ్బా)		3,375
		225

లైవ్ చికెన్ ధర (కిలో రూపాయల్లో)	
ఫారంకోడి	121-00
లైవ్	143-00
డ్రెస్డ్	207-00
స్కిన్‌లెస్	236-00

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు (కిలోకు)



గాంధీనగర్: టమాటా - 30, వంకాయలు - 30, 34, 54, బెండకాయలు - 30, పచ్చిమిర్చి - 32, కాకరకాయ - 34, బీర - 24, 34, క్యాబేజీ - 34, క్యారెట్ - 36, 40, దొండకాయలు - 32, బంగాళాదుంపలు - 30, 36, ఉల్లి - 47, 56, గోరుచిక్కుళ్లు - 30, దోసకాయలు - 34, ఆనబకాయ - 25, 30, పొట్లకాయ - 18, 20, అరటికాయ - 6, 7, చిక్కుళ్లు - 60, 100, చేమదుంపలు - 40, 48, మునగకాడలు - 12, 15, బీట్‌రూట్ - 34, కీరదోస - 30, బీన్స్‌కాయలు - 76, అల్లం - 50, క్యాప్సికం - 68, బొబ్బర్లు - 50, చిలకడదుంపలు - 52, మామిడికాయ - 12,15, నిమ్మకాయలు(డజన్) - 36, 54.

కాకినాడ

సినిమాలు గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- దేవర పార్ట్ 1, సత్య సుందరం, 35, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- దేవర పార్ట్ 1, సత్యం సుందరం, 35, లక్ష్మీ- దేవర పార్ట్ 1, సత్యగౌరి- దేవర పార్ట్ 1, తిరుమల - దేవర పార్ట్ 1, సీఅండ్‌సీ 1- దేవర పార్ట్ 1, సీఅండ్‌సీ 2- దేవర పార్ట్ 1, శ్రీప్రియ - దేవర పార్ట్ 1, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- దేవర పార్ట్ 1, , శ్రీశ్రీనివాసా(వేళంగి)- దేవర పార్ట్ 1.

వాహనచోదకులకు జరిమానా

మసీదుసెంటర్: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన 22 మందికి శుక్రవారం పోలీసులు జరిమానా విధించారు. అనంతరం ట్రాఫిక్-1, 2 సీఐలు రమేష్, రామారావు, ఎస్సైలు, సిబ్బంది వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

30న మెగా ఉద్యోగ మేళా

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30న కాకినాడ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా అధికారి ఎం.కొండలరావు తెలియజేశారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ డీజిల్ మెకానికల్ డిప్లమో చదివిన వారు అర్హులన్నారు. సుమారు 250 మందికి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. బయోడేటా, ఆధార్, విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

బసివిరెడ్డి వీధిలో అన్నదానం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: గణపతి నవరాత్రి ఉత్సవం ముగింపు సందర్భంగా 35వ డివిజన్ బసివిరెడ్డివారి వీధిలో బాల గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అన్న వితరణ చేశారు. 33వ డివిజన్ ఇన్‌ఛార్జి బోర వెంకటేశ్వరరావు(పెద్ది), కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మసీదుసెంటర్: బాసుగుడి వంతెన కింద సరగడ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో 45వ శ్రీ బాల గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు సాయి, వెంకటరెడ్డి, రామిరెడ్డి, అవినాష్ పాల్గొన్నారు.

ఉరిమిన వర్షం మునిగిన నగరం



మెయిన్‌రోడ్డులో నిలిచిన వర్షపునీరు

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్, మసీదు సెంటర్

కాకినాడ నగరంలో ముంపు సమస్యలు కొనసాగుతున్నాయి. వర్షం కురిస్తే చాలు.. పలు ప్రాంతాలు నీటమునుగుతున్నాయి. రహదారులపై రాకపోకలకు వాహన చోదకులు అష్టకష్టాలు పడుతున్నారు. శుక్రవారం ఉదయం గంటపాటు కుండపోత వర్షం కురిసింది. వాహనాలు మొరాయించాయి. సాంబమూర్తినగర్, శాంతినగర్, వెంకటేశ్వర్‌నగర్ ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు అధికంగా ఉండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం, వెనుక వైపు ప్లాట్‌ఫాం వద్ద నీరు నిలిచిపోయింది. జీజీహెచ్‌లోని ప్రాంగణంలో వర్షపునీరు నిలవడంతో రోగులు,వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఈ ప్రాంతాల్లో.. కాకినాడ మెయిన్‌రోడ్డు, కల్పన కూడలి, సాంబమూర్తినగర్, వెంకటేశ్‌నగర్, శాంతినగర్, శ్రీనగర్, కొత్తపేట మార్కెట్, నూకాలమ్మ గుడి, పళ్లంరాజునగర్, గొడారిగుంట, భాస్కర్‌నగర్, టుటౌన్, పిండాలచెరువు, జగన్నాథపురం, జీజీహెచ్, కొత్తకాకినాడ, చిన మార్కెట్, గాంధీబొమ్మ సెంటర్, శాంతినగర్, బాలాజీచెరువు తదితర ప్రాంతాల్లోని రహదారులు వర్షపునీటితో నిండాయి. ప్రధాన మురుగు కాలువలు నిండిపోవడంతో ఏది రహదారో.. ఏది కాలువో.. తెలియని పరిస్థితి నెలకొంది. కొందరు స్థానికులు కాలువల వద్ద నిలబడి వాహన చోదకులకు దారి చూపించారు.



నీట మునిగిన కాకినాడ ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం



శ్రీనగర్ ప్రధాన రహదారిపై నిలిచిన మోకాల్లోతు వర్షపునీరు



జల దిగ్బంధంలో కొత్తపేట మార్కెట్ కూడలి..



పోస్టల్‌కాలనీ వెళ్లే మూడురోడ్ల కూడలి...

కాలువలు అస్తవ్యస్తం



రహదారులు, కాలువలు నిర్మించినా ప్రయోజనం లేదు. కాలువలు ఎత్తు పల్లాల కారణంగా వర్షం వస్తే నీరు వెంటనే లాగడం లేదు. అయోధ్యనగర్ సాయిగుడి వద్ద ప్రధాన కాలువలో అడ్డుగా చెక్క ఏర్పాటు చేశారు. దీనివల్ల నీరు లాగక మురుగంతా రోడ్డుపైకి చేరుతోంది.

—లోవరాజు, లక్ష్మీనారాయణనగర్

నాయీ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడికి సత్కారం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ నగర నాయీబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన వేపాడ శ్రీనివాస్‌ను శుక్రవారం సత్కరించారు. జగన్నాథపురంలోని సత్య మినీ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ, ఏపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ పప్పు దుర్గారమేష్, జిల్లా అధ్యక్షుడు పొన్నాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ, బీసీ సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు, వేదికపై అధికారులు, తెదేపా నేతలు

నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నామని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. శుక్రవారం కొండయ్యపాలెంలో 41, 43, 44, 45, 46 డివిజన్లకు సంబంధించి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ ఉప కమిషనర్ ఎన్.మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రజా వేదిక నుంచి ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. కాకినాడ నగరంలో గంజాయి, మాదక ద్రవ్యాలను ఉక్కుపాదంతో అణిచివేస్తున్నామన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తహసీల్దారు జితేంద్ర, సీఈ అప్పలనాయుడు, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, హౌసింగ్ డీఈఈ సత్యనారాయణరెడ్డి, టీపీఆర్వో శైలజ, మాజీ మేయర్ సుంకర పావని, డాక్టర్ కొండమూర్తి సత్యనారాయణ, సంగిశెట్టి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ సంఘ కార్యవర్గం ఏకగ్రీవం



ఎన్నికైన నూతన కార్యవర్గం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శుక్రవారం అసోసియేషన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని పూర్వపు అధ్యక్షుడు దాట్ల రామకృష్ణరాజు అధ్యక్షతన నిర్వహించారు. కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా దాసరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా అరిగెళ్ల గంగబాబు, అర్జున్‌రాజు, చిట్టిమేను సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా అల్లం రాజు, కార్యదర్శులుగా ఊదా శ్రీను, యలమంచిలి సత్తిబాబు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కాళ్ల భద్రరావు, కొల్లు రవినాగవర్మ, చిన్ని, కోశాధికారిగా గణేశుల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అభినందించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



సబ్‌జైల్ వద్ద న్యాయమూర్తి

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: రిమాండ్ ఖైదీలంతా సత్ప్రవర్తనతో మెలగాలని కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలా శ్యామ్ సుందరి అన్నారు. శుక్రవారం న్యాయమూర్తి ప్రత్యేక సబ్‌జైలును సందర్శించారు. జైలు పరిసరాలు, వంటగది, మహిళా విభాగ సెల్‌ను పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు, ఎంఎల్‌ఎస్‌సీ ఇన్‌ఛార్జి డి.సంధ్య, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు చినశోభనాద్రి సత్రం ఈవోగా భాస్కర్‌రెడ్డి

గాంధీనగర్: బాలాత్రిపుర సుందరి ఆలయ ఈవోగా పనిచేస్తున్న చింతపల్లి విజయభాస్కరరెడ్డిని పెద్ద మార్కెట్‌లోని బంగారు చిన శోభనాద్రి సత్రం ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

దేవాదాయశాఖ ఉపకమిషనర్‌గా రమేష్‌బాబు

గాంధీనగర్, న్యూస్‌టుడే: దేవాదాయ ధర్మాదాయ శాఖ కాకినాడ జోన్ డిప్యూటీ(ఉప) కమిషనర్‌గా డీఎల్వీ రమేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ ధార్మిక భవన్‌లోని డీసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన ఈవోలు, అధికారులు అభినందనలు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్లు బాధ్యతల స్వీకరణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ 1, సబ్ రిజిస్ట్రార్ 2గా బదిలీపై వచ్చిన రామారావు, వీరభద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.



సుధాకరప్రసాద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

పోరాట యోధుడు సుధాకరప్రసాద్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెవెన్యూ ఉద్యోగుల హక్కుల సాధనకు ఎనలేని కృషి చేసిన తోట సుధాకరప్రసాద్ సేవలు చిరస్మరణీయమని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్) జిల్లా శాఖ కొనియాడింది. శుక్రవారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఆయన చిత్రపటానికి ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథరావు, ఉద్యోగులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏపీఆర్ఎస్ఏ ప్రతినిధులు ఎస్.రామ్మోహన్, ఎం.శివకుమార్, విజయ్, ప్రసాద్, గోవిందు, సంధ్య, రమణ్య తదితరులు పాల్గొన్నారు.



సీఈవోకు వినతి పత్రం అందిస్తున్న ఎస్టీయూ సంఘ నాయకులు

పీఎఫ్ సొమ్ము జమ చేయాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల బీమా, పీఎఫ్ సొమ్ము ఎప్పటికప్పుడు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని జడ్పీ సీఈవో లక్ష్మణరావును రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) కోరింది. శుక్రవారం జడ్పీ సీఈవోను ఆయన ఛాంబరులో సంఘ జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె.కాశీ విశ్వనాథ్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. 2023-24 పీఎఫ్ స్లిప్‌లను అందుబాటులో ఉంచాలని, ఉపాధ్యాయుల పీఎఫ్ పార్ట్, ఫైనల్ రుణాలను త్వరితగతిన చెల్లించాలన్నారు. సంఘ నాయకులు యు.శ్రీను, సంపత్‌కుమార్, డీవీఎస్ రాజు, పి.రామకృష్ణ, బి.మహేష్, శివప్రసాద్ పాల్గొన్నారు.

మెప్మా బజారులో ఉత్పత్తులు భళా

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పట్టణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ ఉత్పత్తులతో మెప్మా అర్బన్ బజారు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసు రిజర్వులైను వద్ద ఉన్న మీ-సేవా కేంద్రంలో మెప్మా పీడీ బి.ప్రియంవద శుక్రవారం ఈ బజారును ప్రారంభించారు. ఇక్కడ మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని ఆమె తెలిపారు. రెండు రోజులపాటు ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు. టీపీఆర్వో శైలజ, సిటీ మిషన్ మేనేజరు డి.వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తులను పరిశీలించి మాట్లాడుతున్న ప్రియంవద

ఏడుగురికి జైలు, జరిమానా

మసీదుసెంటర్ (కాకినాడ): మద్యం తాగి వాహనం నడిపిన ఏడుగురిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. అయిదుగురికి 2 రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ మేరకు కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి.నరసింహారావు శుక్రవారం తీర్పు చెప్పారు. నగర ట్రాఫిక్-1 విభాగ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి వీరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ ఎన్.రమేష్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

తుళ్లూరు, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో కడప సెంట్రల్ జైల్లో వార్డెన్‌గా పనిచేస్తున్న కె.మహేష్‌కు మంగళగిరి కోర్టు శుక్రవారం 14 రోజుల రిమాండ్ విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన ఎస్. భువనేశ్వరి రాష్ట్ర హైకోర్టులో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు కె.మహేష్‌తో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహమైంది. గుంటూరు జిల్లా రాయపూడిలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. ఈ ఏడాది ఆగస్టు 22న మనస్పర్థల నేపథ్యంలో అత్త సాయికూమారిపై దాడి చేసి గ్యాస్‌తో కాల్చాడు. ఈ ఘటనపై ఆమె కూమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుళ్లూరు ఎస్.ఐ జి.అంకమ్మ హత్యాత్నం కేసు నమోదు చేశారు. శుక్రవారం ముద్దాయి మహేష్‌ను అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తుళ్లూరు సి.ఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

అపార్టుమెంట్లలో చెత్త తరలింపు



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ భావన

ఈనాడు కథనాలకు స్పందన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధి 41వ డివిజన్‌లోని అపార్టుమెంట్ల సెల్లార్లలో వారానికి పైగా నిల్వ ఉన్న చెత్తను ఎట్టకేలకు తొలగించారు. నెల రోజులుగా ఇంటింటా చెత్త సేకరణ వాహనాలు నిలిచిపోవడం, కాంపాక్టర్లు మరమ్మతులకు గురికావడం, పుష్‌కార్టులు అందుబాటులేకపోవడంతో ఈ 12వ శానిటేషన్ సర్కిల్‌లో చెత్త తరలింపు సవాల్‌గా మారింది. ఈ పరిధిలో 38, 39, 41, 42, 43 డివిజన్లు ఉన్నాయి. ఇక్కడ చెత్త తరలించే కాంపాక్ట్ వాహనం 60 రోజులుగా మూలకు చేరింది. ఈ సర్కిల్‌తో పాటు నగరంలోని మిగతా చోట్ల చెత్త సేకరణ పరిస్థితిపై 'ఈనాడు'లో ప్రచురితమైన వరుస కథనాలతో మున్సిపల్ కమిషనర్ భావన స్పందించారు. శుక్రవారం ఆమె స్వయంగా 41వ డివిజన్‌లోని అపార్టుమెంట్లలో నిలిచిపోయిన చెత్తను చూసి శానిటేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య అధికారులు ప్రత్యేకంగా ట్రాక్టర్లు ఏర్పాటు చేసి చెత్త తరలించారు. 12వ సర్కిల్‌లోని మిగతా అపార్టుమెంట్లలోని చెత్తనూ తరలించాలని ఆదేశించారు.

ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం..

చెత్త తరలింపు అంశం ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాలతో ముడిపడి ఉంది. చెత్త తరలించే వాహనాలు మరమ్మతులకు గురైతే.. ఇంజినీరింగ్ అధికారులు తక్షణం మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలి. వీరు తమకు ఆసక్తి ఉన్న కొన్ని పనులపైనే శ్రద్ధ చూపుతున్నారు. ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న అంశాలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నగరపాలక సంస్థ పరిధిలో 14 శానిటేషన్ సర్కిళ్లు ఉండగా, వీటికి 15 కాంపాక్టర్ వాహనాలను కేటాయించారు. వాటిలో అయిదు దీర్ఘకాలంగా మరమ్మతులతో మూలకు చేరాయి. రెండు సర్కిళ్లకు ఒక వాహనాన్ని కేటాయిస్తున్నారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోతోంది. వీటి మరమ్మతులపై ఇంజినీరింగ్ అధికారులు దృష్టిసారించడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే నగరం చెత్తమయంగా మారే అవకాశం ఉంది. నగరంలో 1,100 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. వీరికి అవసరమైన పుష్‌కార్డులు సమకూర్చితే సమస్య పరిష్కారమయ్యే వీలుంది. వీటినీ కొనుగోలు చేయడంలేదు.



చంద్రబాబు నుంచి అందుకుంటున్న జీఆర్‌టీ గ్రాండ్ హోటల్ జీఎం శివకిరణ్, రాజేష్



మంత్రి దుర్గేష్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న రచయిత శివన్నారాయణరెడ్డి

జీఆర్‌టీ గ్రాండ్‌కు పురస్కారం

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆతిథ్య విభాగంలో కాకినాడ జీఆర్‌టీ గ్రాండ్ హోటల్ అవార్డు గెలుచుకుంది. విజయవాడ తుమ్మపల్లి క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా హోటల్ జీఎం శివకిరణ్, ట్రైనింగ్ మేనేజర్ రాజేష్ అవార్డులు అందుకున్నారు. ★ ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తూ పుస్తకాలను ప్రచురించిన రచయిత, జర్నలిస్టు సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి ఉత్తమ రచనలు- ప్రచురణల విభాగంలో మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా రాష్ట్ర పర్యాటక అవార్డు అందుకున్నారు.

ఉద్యోగ మేళాలో 144 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థినులతో పీడీ, ప్రిన్సిపల్ తదితరులు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. కళాశాల జేకేసీ, వికాస సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తనయుడు మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మేళాను ప్రారంభించారు. సమావేశంలో ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగాలు లభించిన అభ్యర్థులు అనుభవాన్ని సంపాదించుకోవాలన్నారు. వివిధ ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాల కోసం 306 మంది హాజరుకాగా 144 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. వికాస పీడీ కె.లచ్చారావు, వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.సువర్చల, జేకేసీ కోఆర్డినేటర్ డా.పి.సంజోత, స్వాతి తదితరులు పాల్గొని విద్యార్థినులకు తగు సలహాలు, సూచనలు చేశారు.

కోకనాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా రాఘవులు



మాట్లాడుతున్న అధ్యక్షుడు రాఘవులు(బాబు)

గాంధీనగర్: ది కోకనాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా వీవీ రాఘవులు(బాబు) ఎన్నికయ్యారు. శుక్రవారం వార్ఫురోడ్డులోని కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో 2024-25 సంవత్సరానికి కార్యవర్గ ఎన్నిక జరిగింది. బాబు అయిదోసారి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 8 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బాబు మాట్లాడుతూ కాకినాడ పోర్టు ప్రతిష్ఠను కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఛాంబర్ కార్యదర్శి మంగయ్యపంతులు, ఫణి, ప్రసాద్, సుబ్బారావు, విశ్వేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హస్తకళల ప్రదర్శన ప్రారంభం

కాకినాడ నగరం: దేవాలయం వీధి పైండా వెంకట చలమయ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు, హస్తకళల ప్రదర్శన, అమ్మకాలను ఎమ్మెల్యే కొండబాబు శుక్రవారం ప్రారంభించారు.

తహసీల్దార్ కార్యాలయం.. తడిసి ముద్ద



కాకినాడ నగరంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం దుస్థితి ఇది. బ్రిటిష్ కాలం నాటి ఈ భవనం శిథిలావస్థకు చేరింది. 2022లో కొత్త భవనం నిర్మించేందుకు ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. తర్వాత దాని గురించి మరిచిపోయారు. కొద్దిపాటి వర్షం కురిసినా కార్యాలయం తడిసిముద్దవుతుంది. నీరు రికార్డుల గదిలోకి చేరి విలువైన పత్రాలు తడిసిపోతున్నాయి. విద్యుత్తు బోర్డులోకి నీరుచేరకుండా ప్లాస్టిక్ కవర్లను వేశారు. శుక్రవారం కురిసిన వర్షానికి కార్యాలయంలో పరిస్థితి ఇదీ..

—ఈనాడు, కాకినాడ

రాత్రిపూట శవపరీక్షలపై ఆలోచించాలి



జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఐజీ, అతిథులు

మసీదుసెంటర్(కాకినాడ): అత్యవసర పరిస్థితుల్లో ఎస్పీల వినతి మేరకు రాత్రి సమయాల్లో శవపరీక్ష చేస్తే మేలు జరగవచ్చని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(ఐజీ) జి.వి.జి.అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం రెండో రోజు కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్(ఎస్ఐఎంఎల్ఏ) 20వ యాన్యువల్ కాన్ఫరెన్స్-2024 సదస్సుకు ఐజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్ఐఎంఎల్ఏ ఆర్గనైజింగ్ ఛైర్మన్ డా.పి.ఉమామహేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డా.పి.ఫణికిరణ్ అధ్యక్షతన రెండో రోజు సదస్సును తొలుత ప్రారంభించారు. ఫోరెన్సిక్ విభాగంలో అత్యాధునిక సాంకేతికతపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నిపుణులు వివరించారు. వైద్యులు, వైద్యవిద్యార్థులు పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. ఆర్ఎంసీ వైస్‌ప్రిన్సిపల్స్ డా.ఎ.విష్ణువర్ధన్, డా.డీఏవీఎస్ శశి, ఇతర వైద్యనిపుణులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం నేడు

గొల్లప్రోలు: గొల్లప్రోలు నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం శనివారం ఉదయం 11 గంటల నుంచి జరుగుతుందని కమిషనర్ రవికుమార్ తెలిపారు. కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఛైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగే సమావేశంలో వివిధ అభివృద్ధిపనులు, నగర పంచాయతీకి చెందిన దుకాణాల అద్దెల పెంపు నిర్ణయం గురించి అజెండాలో ప్రవేశపెట్టిన అంశాలపై పాలకవర్గ సభ్యులు చర్చిస్తారన్నారు.

30న పెద్దాపురంలో..

పెద్దాపురం: పురపాలక సంఘం సాధారణ సమావేశం ఈనెల 30న ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ హాలులో ఛైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన నిర్వహిస్తామని కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. సమావేశానికి అన్ని విభాగాల అధికారులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

బ్యాంకులకు వరద బాధితుల తాకిడి

గొల్లప్రోలు: వరద బాధితులకు ప్రభుత్వం జమచేసిన సొమ్ము పొందేందుకు వచ్చిన లబ్ధిదారులతో బ్యాంకులు శుక్రవారం కిక్కిరిశాయి. గొల్లప్రోలులోని పలు బ్యాంకుల్లో ఆర్థిక సాయం సొమ్ము పొందేందుకు బాధితులు బారులు తీరారు. గృహాలు ముంపునకు గురైన కుటుంబాలకు రూ.10వేలు, పంటనష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు చొప్పున కూటమి ప్రభుత్వం ఖాతాల్లో జమచేసింది. ఆ సొమ్ము పొందేందుకు లబ్ధిదారులు బ్యాంకులకు తరలివచ్చారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

సామర్లకోట: పంచారామ క్షేత్రం కుమారారామ భీమేశ్వరాలయంలో నిత్యం జరిగే అన్నదాన కార్యక్రమానికి శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన వేల్పూరి శంకరరావు, నాగమణి దంపతులు రూ.10,116 విరాళం అందించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పగలూ వెలుగులు!

సమస్య: కొండెవరం పంచాయతీ కరణంగారి వీధి, అమరవిల్లి జగనన్న లేఅవుట్ సమీపంలో విద్యుత్తు దీపాలు పగలూ వెలుగుతున్నాయి. **- స్థానికులు**

సమాధానం: తక్షణమే పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేసి చర్యలు తీసుకుంటాం. **- వెంకటనారాయణ, ఎంపీడీవో**

–న్యూస్‌టుడే, కొత్తపల్లి

గండ్లు పూడ్చండి

సమస్య: గొల్లప్రోలు శివారు నక్కల ఖండి కాలువకు పడిన గండిని పూడ్చి పంటల సాగుకు అవకాశం కల్పించాలి. వెంటనే పనులు చేపట్టాలి. **- డి.తాతాజీ, గొల్లప్రోలు**

సమాధానం: గండి పూడ్చేందుకు రూ.14.62 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో త్వరలో పనులు చేపడతాం. **- పద్మజ, ఏఈ, జలవనరులశాఖ**

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

వర్షం వస్తే రాకపోకలు బంద్

సమస్య: వర్షం కురిస్తే మహారాణి సత్రం రహదారి ఛిద్రమవుతోంది. మోకాలిలోతు నీరు నిలిచిపోతోంది. **- టి.శ్రీనివాసు, పెద్దాపురం**

సమాధానం: ఆ ప్రాంతంలో కాలువల నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్**

– న్యూస్‌టుడే, పెద్దాపురం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

ఆర్ఆర్‌బీ చెరువు.. నిర్వహణ కరవు!

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు మండలం మల్లవరంలోని ఆర్ఆర్‌బీ చెరువు జిల్లాలోనే అతిపెద్దది. ఈ చెరువుపై పట్టింపు లేకపోవడంతో సమస్యలు తిష్ఠ వేశాయి. ఆదరణకు నోచుకోకపోవడంతో చెరువు గర్భం పూడుకుపోయి ఆయకట్టుదారులకు సక్రమంగా సాగునీరందడంలేదు. పూడుకుపోయిన ప్రాంతంలో పంటలు సాగుచేస్తున్నారు. దీంతో నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయింది. వర్షాకాలంలోనూ చెరువులో నీరులేక దర్శనమివ్వడం గమనార్హం. ఫలితంగా పంట పొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

శిథిలస్థితిలో ప్రధాన కళింగలు..

మల్లవరంలో సర్వేనంబరు 467లో 1,313 ఎకరాల విస్తీర్ణంతో పిఠాపురం మహారాజా రాజా రావు బహద్దూర్ (ఆర్ఆర్‌బీ) చెరువును తవ్వించారు. ఈ చెరువుకు ప్రధాన కళింగలా, 14 స్లూయిస్‌లు నిర్మించి గొల్లప్రోలు, కొత్తపల్లి, తొండంగి మండలాల్లోని 14 గ్రామాలకు తాగు, సాగునీరు అందించేలా ఏర్పాటుచేశారు. ఏలేరు, పీబీసీ, ఇతర కాలువల ద్వారా వచ్చే నీరు శివారున ఈ చెరువులోకి చేరుతుంది. వృథానీరు, భారీ వర్షాలు, వరదల సమయాల్లో వచ్చే నీటిని ఈ చెరువులో నిలువ చేయడం ద్వారా అవసరమైన సమయాల్లో సాగునీటిగా వినియోగించేందుకు వీలుగా కొత్తకాలువను అనుసంధానం చేశారు. ఈ నీటితో 14వేల ఎకరాలు సాగయ్యేలా ఏర్పాటు ఉంది. అయితే, 800 ఎకరాలు పూడుకుపోవడంతో సుమారు 600 ఎకరాల్లోనే 5 గ్రామాలకు చెందిన వారు వరి సాగు చేసుకుంటున్నారు. ప్రధాన కళింగలా గేట్లు తుప్పుపట్టి, రాతి కట్టడం బీటలువారి శిథిలమైంది. 14 స్లూయిస్‌ల్లో 8 శిథిలమయ్యాయి. దీర్ఘకాలంగా ప్రధాన కళింగలా, స్లూయిస్‌ల మరమ్మతులు చేపట్టలేదు. దీంతో చెరువు నుంచి పంట పొలాలకు సాగునీరు మళ్లించుకోవడం కష్టంగా మారింది. రైతులు అడ్డుగా ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తున్నారు.



శిథిలమైన చెరువు ప్రధాన కళింగలు..

ప్రతిపాదనలతో సరి..

గతంలో ఎస్ఈజెడ్‌లో పరిశ్రమలు ఏర్పాటుచేసే ప్రాంతానికి ఆర్ఆర్‌బీ చెరువులో పూడిక తొలగించి సదరు మట్టిని తరలించేందుకు ప్రతిపాదనలు రూపొందించినా కార్యరూపం దాల్చలేదు. చెరువు గర్భంలో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. 30 ఏళ్లకు పైబడి చెరువు అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. దీంతో ఆయకట్టు పొలాలకు సాగునీరందించలేక రైతులు పంటలు ఎండి ఇబ్బందులు పడుతున్నారు. ఎ.కె.మల్లవరం, ఎ.పి.మల్లవరం తదితర గ్రామాల్లో గత ఏడాదిలో సార్వా వరి పంట పొలాలకు సాగునీరందక బీటలువారి రైతులు నష్టపోయారు. ఈ చెరువు సమస్యలు పరిష్కరిస్తే 14 గ్రామాలకు తాగునీరు, 14 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించే అవకాశం ఏర్పడుతుంది.



గుర్రపుడెక్కతో నిండిన చెరువు

ఉన్నతాధికారులకు పంపాం..

మల్లవరం ఆర్ఆర్‌బీ చెరువు ప్రధాన కళింగలా, స్లూయిస్‌లు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. వీటిని నిర్వహించేందుకు రూ.19.92 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపాం. చెరువు అభివృద్ధి పనులకు నిర్వహణకు ప్రతిపాదనలు తయారుచేస్తాం.

- పద్మజ, ఏఈ, జలవనరులశాఖ



ఎంపికైన శహపురం విద్యార్థులు

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

పెదపూడి, న్యూస్‌టుడే: మండలంలోని శహపురం, సంపర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.రవి తెలిపారు. హ్యాండ్‌బాల్ అండర్-14 బాలికల విభాగంలో వాసంశెట్టి తేజశ్రీదుర్గ, కొప్పిశెట్టి మణి, కాకరపల్లి చైత్రనందిత, బాలుర విభాగంలో రాయుడు వరప్రసాద్, అండర్-17 బాలికల విభాగంలో వాసంశెట్టి శశిదేవి, వల్లు శృతి, బాలుర విభాగం నుంచి నక్కా కూర్మ వెంకట సాయి కృష్ణ ఉన్నారు. సంపర జడ్పీ పాఠశాల నుంచి మొకమాటి అజ్జు, సలాది దివ్య దుర్గ, పిల్ల లక్ష్మణ స్వామి, ఎరుబడి రాములు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఆర్.త్రిమూర్తులు తెలిపారు.

సామర్లకోట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు అయోధ్యరామపురంలోని బచ్చు ఫౌండేషన్ పురపాలక సంఘం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. వారిలో పి.జ్యోత్స్నదుర్గాసాయి, జి.లక్ష్మీవర్షిణి, పి.దుర్గాసృజన జిల్లాస్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్రస్థాయి యోగా పోటీలకు యశ్వంత్ అర్హత సాధించాడని వివరించారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు 18 నామినేషన్లు

పిఠాపురం, న్యూస్‌టుడే: పట్టణంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగే ది పిఠాపురం అర్బన్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బ్యాంకు ఎన్నికల హడావుడి మొదలైంది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ నామినేషన్లు స్వీకరించారు. 5 మెంబర్ల ఎన్నికకు సంబంధించి 18 నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. శనివారం పరిశీలన, ఆదివారం ఉప సంహరణ, పోటీలో ఉండే వ్యక్తులకు గుర్తులు కేటాయించనున్నట్లు చెప్పారు. వచ్చేనెల 6న ఎన్నిక జరుగుతుందని, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామన్నారు. కాగా పోటీ చేసే అభ్యర్థులకు మద్దతుగా జనం అధిక సంఖ్యలో తరలిరావడంతో బ్యాంకు వద్ద ఎన్నికల వాతావరణం నెలకొంది.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పిఠాపురం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతం కృషి చేస్తామని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా గౌరవ అధ్యక్షుడు కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. శుక్రవారం కుమారపురం, ఎఫ్‌కేపాలెం, విరవాడ, బీఎంఆర్ తదితర పాఠశాలల్లో ఆయన పర్యటించారు. సభ్య నమోదు కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటమూర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తమ్మయ్య, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో దీక్షలో కూటమి నాయకులు

పవన్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు కూటమి నాయకులు మద్దతుగా గొల్లప్రోలు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం దీక్ష నిర్వహించారు. బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పిఠాపురం: డిప్యూటీ సీఎం పవన్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా పిఠాపురం జనసేన నాయకులు దీక్ష చేశారు. నాయకులు బీఎస్ రాజు, సూరవరపు సురేష్, మార్నీడి రంగబాబు, వెల్లుబోయిన సతీష్ పాల్గొన్నారు.

బదిలీ చేశారు.. పోస్టింగ్ ఇవ్వలేదు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లోని ఇద్దరు అధికారులను బదిలీచేసినా వారికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామారావు, డీఎస్పీ కె.లతాకుమారిలను ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్డీవో మరో అయిదు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు.

భక్తి, విశ్వాసంతో మనసుకు ప్రశాంతత

సామర్లకోట, న్యూస్‌టుడే: భక్తి, విశ్వాసంతోనే మనసుకు ప్రశాంతత కలుగుతుందని ఉత్తరాంధ్ర రామకృష్ణ, వివేకానంద భావప్రచార పరిషత్ అధ్యక్షుడు, విశాఖపట్నం రామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వసంవేద్యానంద మహారాజ్ అన్నారు. శుక్రవారం పెదబ్రహ్మదేవం గ్రామంలోని శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సత్సంగంలో ఆయన మాట్లాడారు. మనిషి తన కోసం ఆరాటపడటంలో తప్పులేదని, తరతరాల కోసం సంపాదన పోగుచేసుకోవాలనే యావతోనే అశాంతికి గురవుతున్నాడని చెప్పారు. ధ్యాన, భక్తి, విశ్వాసం దేవునిపై ఉంచినవారు ఎలాంటి అశాంతికి గురికారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీని సమితి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో శారదా రామకృష్ణ సేవా సమితి నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



సత్సంగంలో మాట్లాడుతున్న స్వసంవేద్యానంద మహారాజ్

సబ్ రిజిస్ట్రార్‌గా రమాదేవి బాధ్యతలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం సబ్ రిజిస్ట్రార్‌గా వీవీ రమాదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ రిజిస్ట్రేషన్ డీఐజీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కాగా ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసే విక్టర్ డానియేల్ ప్రత్తిపాడు బదిలీపై వెళ్లారు.



సేవలు వినియోగించుకోవాలి

కరప, న్యూస్‌టుడే: రైతులకు సకాలంలో దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అందిస్తున్న సహకార సంఘాల సేవలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్, పర్సన్ ఇన్‌ఛార్జి ఎన్‌వీఎస్ ఆర్‌కె దుర్గాప్రసాద్ సూచించారు. కరప మండలం జడ్.భావారంలో శుక్రవారం సీఈవో రాయుడు వెంకటేశ్వరరావు అధ్యక్షతన సంఘ పరిధిలోని డైరెక్టర్లు, రైతులతో సభ నిర్వహించి ప్రగతిపై చర్చించారు.

రూ.20 కోట్లతో రహదారుల అభివృద్ధి

సామర్లకోట, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని రోడ్లను రూ.20 కోట్లతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శుక్రవారం హుస్సేన్‌పురంలో రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రోడ్ల అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామన్నారు. తెదేపా నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, చల్లా వెంకటరమణ, పుప్పాల సాయికృష్ణ, మార్ని సూర్యారావు, రఘు వంశీ, అబ్బాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన పూజల్లో ఎమ్మెల్యే చినరాజప్ప

సర్పవరం జంక్షన్: సీఎం చంద్రబాబుతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని, విజయవాడ వరదల సమయంలో దగ్గరుండి ప్రజల కష్టాలు తీర్చి బాధితులకు రూ.620 కోట్లు అందించారని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి తెలిపారు. కాకినాడ అర్బన్ 2వ డివిజన్ గోడారిగుంట, గ్రామీణ మండలం పి.వెంకటాపురం గ్రామాల్లో శుక్రవారం ఆమె నియోజకవర్గం కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లరేవు: ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాల హామీలు అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెదేపా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి అన్నారు. కొత్తకోరంగి దిండిలో కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వంపై రామలక్ష్మి ఇంటింటా తిరుగుతూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాజులూరు విద్యార్థుల ప్రతిభ

కాజులూరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ విలువిద్య పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు కాజులూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయ పంపన కృష్ణమూర్తి తెలిపారు. కాకినాడలోని డీఎస్ఏ గ్రౌండ్‌లో గురువారం జరిగిన స్కూల్ గేమ్స్ ఎంపికలో విలువిద్య పోటీల అండర్-14 బాలుర విభాగంలో వి.శ్రీసాయి జన్, బాలికల విభాగంలో ఆర్.కుసుమదుర్గ, ఎల్.కీర్తి, అండర్-17 బాలుర విభాగంలో బి.వి.వి.సత్యనారాయణ, బాలికల విభాగంలో కొప్పిశెట్టి సత్యలక్ష్మి దుర్గ, కొన వెంకటలక్ష్మి ఎంపికైనట్లు తెలిపారు. వీరితో పాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులు జేమ్స్ రవి సుందర్‌కుమార్, టీఎస్ వీఆర్ మూర్తి, కె.నాగలక్ష్మిని ఎస్ఎంసీ ఛైర్మన్ శ్రీ పద్దరాజు, సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.



రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైన వారితో ఉపాధ్యాయులు

పిఠాపురం: మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రాణించిన విద్యార్థులంతా రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటాలని ప్రిన్సిపల్ పోలుపర్తి వేణు అన్నారు. పిఠాపురం భాష్యం పాఠశాలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అండర్-17 బాస్కెట్‌బాల్ విభాగంలో పదో తరగతి విద్యార్థి ఎ.నీరజ్, అండర్-17 ఆర్చరీ విభాగంలో 9వ తరగతి విద్యార్థి అరుణ్ రాఘవేంద్ర, అండర్-14 ఆర్చరీ విభాగంలో 7వ తరగతి విద్యార్థి బి.జైదీప్ ఎంపికయ్యారన్నారు. పీఈటీలు కృష్ణార్జున, భవానీ, ఆర్చరీ కోచ్ లక్ష్మణరావు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వేణు

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కూలిన బోర్డు



సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కాకినాడ వెళ్లే ప్రయాణికులు వేచి ఉండే బస్టాపు వద్ద షెల్టర్‌కు ఏర్పాటుచేసిన బోర్డు నేలకూలింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నానిపోయిన బోర్డు శుక్రవారం మధ్యాహ్నం ప్రయాణికులు వేచి ఉన్న సమయంలో ఒక్కసారిగా సగం వరకు కూలిపోయింది. ఆ సమయంతో ప్రయాణికులు బస్టాపులోనే ఉన్నా ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. వెంటనే స్పందించిన ఆర్టీసీ అధికారులు ఆ బోర్డును అక్కడి నుంచి తొలగించారు. **-న్యూస్‌టుడే, సామర్లకోట**



గైగోలుపాడు కార్యక్రమంలో భక్తులు

దసరా నవరాత్రులకు రాట ముహూర్తం

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణం రమణయ్యపేట పంచాయతీ గైగోలుపాడు గ్రామదేవత శ్రీదుర్గాలమ్మ ఆలయంలో దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ధర్మకర్త పాలిక శ్రీను. ఛైర్మన్ పాలిక రాజా ఆధ్వర్యంలో శుక్రవారం రాట మహూర్తం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గౌరవాధ్యక్షుడు గుబ్బల అప్పారావు, ప్రతినిధులు పాలిక నరసింహమూర్తి, కోడి సీతారామయ్య, కాకరపల్లి శ్యామ్, పిల్లి వినయ్, పెంకే వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం: శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని పెద్దాపురం పట్టణం, మండలంలోని వివిధ దుర్గమ్మ దేవాలయాల ఆవరణల్లో శుక్రవారం రాట ముహూర్తం నిర్వహించారు. దీనిలో భాగంగా పాశీలవారివీధిలోని దుర్గమ్మ గుడి వద్ద పలువురు మహిళలు భక్తిశ్రద్ధలతో రాటవేసే క్రతువులో భాగస్వాములయ్యారు. శనివారం వర్ధులవారివీధిలోని భువనేశ్వరి పీఠంలో రాట ముహూర్తం పూజలు చేస్తామని పీఠం నిర్వాహకులు చింతా గోపీశర్మ సిద్ధాంతి తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా సూర్యనారాయణ

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా ఎం.సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ముమ్మిడివరం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ డీఈఈగా పనిచేసిన ఎ.శ్రీనివాసరావు పి.గన్నవరానికి బదిలీపై వెళ్లారు.

విద్యుత్తుశాఖ ఏఈగా సత్యనారాయణ

పెదపూడి: మండల విద్యుత్తు శాఖ ఏఈగా జి.వి.వి.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అయన ఇప్పటి వరకు కాకినాడలో పని చేశారు.

జేఈ సుకీర్తి బాధ్యతల స్వీకరణ

తాళ్లరేవు, న్యూస్‌టుడే: తాళ్లరేవు మండల ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుకీర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సుంకరపాలెంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

పట్టుగూళ్ల కొనుగోలుకు చర్యలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: చేబ్రోలు పట్టుపరిశ్రమలోని మార్కెట్ కేంద్రంలో రైతులు పండించిన పట్టుగూళ్లు కొనుగోళ్లు జరిపేందుకు రాష్ట్రంతో పాటు, అంతరాష్ట్రాల రీలర్లు వచ్చేలా చర్యలు చేపడతామని పట్టుపరిశ్రమశాఖ జిల్లా అధికారిణి గీతారాణి తెలిపారు. చేబ్రోలులోని పట్టుపరిశ్రమల కేంద్రంలో పట్టురైతుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నాణ్యమైన మల్బరీ ఆకును పట్టుపురుగులకు ఆహారంగా అందించడంతోనే అధిక పట్టుగూళ్ల దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. చేబ్రోలు పట్టుపరిశ్రమ మార్కెట్ కేంద్రం అధికారి మోసయ్య, సిబ్బంది, పట్టురైతులు హాజరయ్యారు.

కళాశాలలో రక్తదాన శిబిరం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: తాళ్లరేవు మండలం సుంకరపాలెంలోని రవి డిగ్రీ కళాశాలలో జిల్లా లయన్స్‌క్లబ్ పూర్వపు గవర్నర్ బాదం బాలకృష్ణ పుట్టిన రోజును పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది 50 మంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. లయన్స్‌క్లబ్ జీఎల్‌టీ సమన్వయకర్త పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, కళాశాల యాజమాన్యం వెంకటేశ్వరరావు, రవికుమార్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, వేగేశ్న భాస్కరరాజు, నడిపల్లి వినోద్, ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



సుంకరపాలెంలో రక్తదాన శిబిరం

● గాడిమొగ పీహెచ్‌సీ వైద్యురాలు జయభార్గవి ఆధ్వర్యంలో కొత్త కోరంగి దిండిలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. 70 మంది రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులందించారు. ఏఎన్‌ఎం వసంత, ఎంఎల్ హెచ్‌బీ కె.శాంతి, హెల్త్ అసిస్టెంట్ కాలా ఆంజనేయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

29న కాలేషా మస్తాన్ బాబా ఉరుసు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పాత పెద్దాపురం రహదారిలోని కాలేషా మస్తాన్ బాబా ఉరుసు ఈనెల 29న నిర్వహిస్తామని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం దర్గా వద్ద ఫాతేహాఖానీ, గంధం పంపిణీ తర్వాత అన్నదానం ఉంటుందన్నారు. పెద్దాపురం నుంచి సామర్లకోట వెళ్లే ప్రధాన రహదారిలోని ఖాదర్ వలీబాబా వారి ఉరుసు ఈనెల 28న నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

కరప, న్యూస్‌టుడే: కరప మండలంలో కుండపోతగా కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. శుక్రవారం ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులపై నీరు నిలిచి తటాకాలను తలపించడంతో వాహనదారులు చిరు వ్యాపారులు, తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ముంపునీరుతో పాటు గృహాల వాడకపు నీరు రహదారుల మీద ఏరులై పారింది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పంటపొలాలలో ముంపునీరు నిలిచిపోవడంతో వాటిని బయటకు పంపేందుకు రైతన్నలు ఇక్కట్లు పడ్డారు. కరప, గొర్రిపూడి, వేములవాడ, వలసపాకల, వేళంగి, వాకాడ, పెనుగుదురు, కొరిపల్లి, నడకుదురు తదితర గ్రామాల్లో వర్షానికి లోతట్టు ప్రాంతాలలో ముంపునీరు నిలిచిపోయింది.



రమణయ్యపేట భవానీ నగర్‌లో..



వేళంగి గ్రామసచివాయం వద్ద ప్రధాన రహదారిపై నీరు

సర్పవరం జంక్షన్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీల్లో రహదారులు జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలు సాగించడానికి అవస్థలు ఎదుర్కొన్నారు.

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

న్యాయం చేయండి
● 'ప్రజా దర్బార్'లో మంత్రి లోకేశ్‌కు మొర

తాడేపల్లి: రూ.11 లక్షలు రుణం తీసుకుంటే రూ.43 లక్షలు కట్టమని ఒత్తిడి చేస్తున్నారంటూ కోటనందూరు మండలం భీమవరపుకోటకు చెందిన ఆళ్ల దేవి 'ప్రజా దర్బార్'లో మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉండవల్లి నివాసంలో మంత్రి ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. తనఖా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు చెప్పి జీపీఏ సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసి తమ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆ మహిళ మంత్రి లోకేశ్ వద్ద కన్నీళ్ల పర్యంతమైంది. తొలుత తనఖా అని చెప్పి స్టాంప్ పేపర్లు చూపి అనంతరం కాగితాలు మార్చేసి జీపీఏ, సేల్ డీడ్ చేశారు. అదేమని ప్రశ్నిస్తే పొరపాటు జరిగిందంటూ స్టాంప్ పేపర్‌పై రాసి ఇచ్చారు. ఇప్పుడు వడ్డీతో సహా రూ.43 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.' అని ఆమె మంత్రి వద్ద వాపోయారు.

చర్చిలో ఉపవాస ప్రార్థనలు



ఉపవాస ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

గండేపల్లి(జగ్గంపేట) : జగ్గంపేట టవర్ కాలనీ హిజ్ మినిస్ట్రీస్ చర్చిలో రెండు రోజులుగా ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ సురేంద్రకుమార్ తెలిపారు. పాస్టర్ మాట్లాడుతూ.. ఏటా సెప్టెంబరులో మూడు రోజుల పాటు ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. పాస్టర్లు నటరాజన్ లాజరస్, గ్రేస్ విక్టర్, సంతోష్‌రెడ్డి, సుభాకర్, కరుణ కుమార్, సుదర్శనరావు క్రీస్తు సందేశాన్ని అందించినట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పూడిక తొలగింపు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మల్లిసాల రామాలయం వీధిలో డ్రైనేజీలో పూడికలు పేరుకుపోయి మురుగు నీరు పారక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గ్రామ సర్పంచికి వివరించగా యంత్రాన్ని అమర్చి పూడికలు తొలగించే చర్యలు చేపట్టారు.

స్పందనకు వందనం

వ్యర్థాలను తరలించారు

శంఖవరం: శంఖవరంలోని 4వ వార్డులో చెత్త పేరుకుపోయి, మురుగు కదలక దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సచివాలయ కార్యదర్శి శంకరాచార్యులు వద్ద ప్రస్తావించగా ఆయన స్పందించారు. సిబ్బందితో వ్యర్థాలను తొలగింపజేశారు.

వీధులు శుభ్రం

రౌతులపూడి: మండలంలోని జల్దాం గ్రామంలో పాఠశాల వీధిలో రోడ్డుకి ఇరువైపులా తుప్పలు పేరుకుపోయాయి. సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎంవీఎస్ రెడ్డి వద్ద ప్రస్తావించగా ఆయన స్పందించారు. సిబ్బందిని పంపి పనులు చేయించారు. తుప్పలు తొలగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

ప్రమాదకరంగా ఎన్‌హెచ్‌ల నిర్వహణ..!

✦ ఎక్కడికక్కడ నిలుస్తున్న వర్షపునీరు ✦ రాత్రివేళ అంధకారం.. పట్టింపులేని వైనం

గండేపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి ప్రయాణం అంటే వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఉండాలి. కాని జగ్గంపేట నియోజకవర్గంలో ఎన్‌హెచ్‌పై ప్రయాణమంటేనే వాహనదారులకు కత్తిమీద సాములా ఉంటుందంటే అతిశయోక్తి కాదు. కళ్ల ముందు సమస్యలు కనిపిస్తున్నా రహదారి భద్రత సిబ్బంది, నిర్వహణ అధికారులకు పట్టనివైనం. వెరసి వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది.



ప్రమాదకరంగా జగ్గంపేట కూడలి వద్ద దాటుతున్న వాహనాలు

ఒకటా.. రెండా.. అన్నీ సమస్యలే..

ఎన్‌హెచ్‌పై చిన్నపాటి చినుకు పడితే నీరు నిల్వ ఉంటుంది. దీంతో వాహనాలు ఒకవైపు వెళ్తుంటే ఆ నీరు అవతలివైపు వచ్చే వాహనదారులపై పడుతోంది. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. నీలాద్రిరావుపేట, జొగ్గంపాలెం, తాళ్లూరు దాబావద్ద రహదారి పక్కన నీరు నిలుస్తోంది. దీంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రి అయితే రహదారిపై మధ్యన ఉన్న లైట్లు వెలగకపోవడంతో ప్రమాదకర కూడళ్ల వద్ద ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రహదారి మధ్య వేసిన మొక్కల ప్రదేశాలను శుభ్రం చేయాల్సి ఉంది. అందులోనూ నిర్లక్ష్యమే. రోడ్డు మరమ్మతుల కోసం తెచ్చిన సామగ్రిని రోజులు గడుస్తున్నా వెంటనే గుంతల్లో సర్దకుండా తాత్సారం చేస్తున్నారు. ఇవి కూడా రాత్రి సమయాల్లో ప్రమాదాలకు కారణమవుతున్నాయి.




తాళ్లూరు దాబాల వద్ద రహదారి పక్కన వాన నీరు


సమస్యలను ఎవరూ మా దృష్టికి తీసుకురాలేదు..

వర్షం వచ్చినప్పుడు లైట్లు ఆరిపోతుంటాయి. మళ్లీ వెలుగుతుంటాయి. నెలకు ఒకసారి రహదారి మధ్యలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగిస్తాం. రహదారి పక్కన నిలిచిపోతున్న నీటిని సిబ్బందిని పంపి సమస్య ఎక్కడెక్కడ ఉందో గుర్తించి రెండు రోజుల్లో పరిష్కరిస్తాం. - మధుబాబు, మేనేజర్, హైవే నిర్వహణ

కొత్త సార్లొచ్చారు..!



తుని పట్టణం: తుని సబ్‌రిజిస్ట్రార్‌గా టి.సుబ్బారెడ్డి ప్రత్తిపాడు నుంచి బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న సీహెచ్‌వివి సత్యనారాయణ అల్లవరం బదిలీపై వెళ్లారు.



గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే: జగ్గంపేట విద్యుత్తు శాఖ ఈఈగా జి.వీరభద్రరావు బాధ్యతలు చేపట్టారు. నిడదవోలులో ఈఈగా చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఈఈగా విధులు నిర్వహించిన రత్నాలరావు బదిలీపై రామచంద్రాపురం వెళ్లారు.



ఏలేశ్వరం: అందరి సహకారంతో పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఏలేశ్వరం నూతన మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ అన్నారు. కమిషనర్‌గా ఆయన కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు.



గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే: జగ్గంపేట పశువుల ఆసుపత్రి ఏడీగా కె.తాతియ్య బాధ్యతలు చేపట్టారు. సామర్లకోటలో ఏడీగా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఏడీగా విధులు నిర్వహించిన సత్యనారాయణ పదోన్నతిపై కొవ్వూరు ఉప సంచాలకులుగా వెళ్లారు.

విజయదశమి ఉత్సవాలకు శ్రీకారం

ఏలేశ్వరం: ఏలేశ్వరం అటవీ శాఖ కార్యాలయం వద్ద దుర్గమ్మ ఉత్సవాల నిర్వహణకు శుక్రవారం జరిగిన అంకురార్పణ పూజల్లో ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ అలమండ చలమయ్య, నాయకులు పాండ్రింకి అప్పారావు, చల్లా గణేష్, కె.వాసు, తూమురౌతు గుర్రయ్య, ఏడీవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఛైర్‌పర్సన్ సత్యవతి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరిలో భక్తిభావం పెంపొందించేందుకు ఈ తరహా ఉత్సవాలు దోహదం చేస్తాయన్నారు.



ఏలేశ్వరంలో పందిరిరాట పూజలు

తుని: రామకృష్ణాకాలనీలో వినాయక చవితి ఉత్సవాలు పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణ సీఐ ఎం.గీతా రామకృష్ణ, తెదేపా మాజీ కౌన్సిలర్ సిద్ధాంతపు సత్తిబాబు హాజరై భక్తులకు ఆహార పదార్థాలు వడ్డించారు.

వనదుర్గ అమ్మవారి ఆలయంలో చండీహోమం

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం సత్యదేవుని క్షేత్ర రక్షకులుగా కొలిచే వనదుర్గ అమ్మవారి ఆలయంలో చండీహోమం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.. ● శ్రీశైలం దేవస్థానం నుంచి అన్నవరం ఆలయానికి బదిలీపై వచ్చిన ఈఈ రామకృష్ణ, ఇతర ఉద్యోగులు విధుల్లో చేరారు. అన్నవరం పీఆర్వోకు సింహాచలం దేవస్థానానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో పీఆర్వోగా జగ్గారావును నియమించారు.



శంఖవరం: సీతంపేట దుర్గామీనాక్షి అమ్మవారికి శుక్రవారం కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కత్తిపూడి కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అన్నదానం జరిగింది.

ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం

గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందనే విషయాన్ని ఈ వంద రోజుల్లో ప్రజలు గమనించారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం జగ్గంపేట ఆర్యవైశ్య కల్యాణమండపంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగ్గంపేట పంచాయతీలో రూ.3.50 కోట్లతో సీసీరోడ్లు, రూ.8 కోట్లతో డ్రైన్లు నిర్మించనున్నామన్నారు. జనసేన నాయకుడు తుమ్మలపల్లి రమేష్, నాయకులు అప్పలరాజు, భద్రం, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. అప్పనపాలెంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యప్రభ, జనసేన ఇన్‌ఛార్జి వరుపుల తమ్మయ్యబాబు మాట్లాడుతూ.. వంద రోజుల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. కరపత్రాలు, గోడ పత్రికలను ప్రదర్శించారు. నాయకులు దాసరి సత్యనారాయణ, బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, సుబ్బరాజు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివ్య



జగ్గంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

పార్టీ బలోపేతానికి కృషి

తుని గ్రామీణం: పార్టీ బలోపేతానికి నాయకులు, కృషి చేయాలని ఎమ్మెల్యే యనమల దివ్య సూచించారు. గెడ్డపేట సాయి వేదికలో శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి బూత్ ఏజెంట్ కనీసం వంద సభ్యత్వాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యనమల సతీష్, గాడి రాజబాబు, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, యినుగంటి సత్యనారాయణ, దంతులూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



అప్పనపాలెంలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, నాయకులు

నవ వధువుకు నెహ్రూ ఫౌండేషన్ సాయం

కిర్లంపూడి: పేద కుటుంబాల్లో యువతులకు వివాహం జరిపించే సమయంలో తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలనే లక్ష్యంతో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా రూ.20 వేలు సహాయం చేయడం ఆనందంగా ఉందని నెహ్రూ ఫౌండేషన్ ఛైర్మన్ జ్యోతుల మణి అన్నారు. దీనిని నియోజకవర్గంలో తూచ తప్పక అమలు చేస్తామన్నారు. సోమవరం గ్రామంలో వీధి కొండలరావు, రఘుపతి దంపతుల కుమార్తె నాగమణిని నాగరాజుకు ఇచ్చి శుక్రవారం రాత్రి వివాహం జరిపించారు. ఈ వేడుకకు హాజరైన నెహ్రూ ఫౌండేషన్ ఛైర్మన్ మణి నవ దంపతులకు రూ.20వేల చెక్కును అందజేశారు. పేదలు పెళ్లికి వారం రోజుల ముందు ఫౌండేషన్ కార్యాలయానికి తెలియజేస్తే సహాయాన్ని అందజేస్తామన్నారు. ఎంపీపీ తోట రవి, సర్పంచి మహాలక్ష్మి, నాయకులు చదరం చంటిబాబు, మంచికంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఫౌండేషన్ ఛైర్మన్ జ్యోతుల మణి

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు సత్కారం

గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే: జగ్గంపేట ఎంపీడీవోగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లనున్న వసంత్‌కుమార్‌ను శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అధికారులు సన్మానించారు. జగ్గంపేట ఎంపీడీవో బదిలీపై శ్రీకాకుళం జిల్లా పలాస ఎంపీడీవోగా వెళ్లనున్నారు. తహసీల్దారు శ్రీరామ్, ఎపీవో కృష్ణంరాజు తదితరులు వీడ్కోలు పలికారు.

ముంపులో వరి పొలాలు

తుని గ్రామీణం: రాజుపేటలో పది రోజులుగా వరద నీటి ముంపులో వరిపొలాలు ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గ్రామంలోని పెద్ద చెరువు పూర్తిగా వర్షపు నీటితో నిండిఉంది. రోజూ కురుస్తున్న వర్షాలకు చెరువు ఎగువ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున నీరు చేరుతోంది. చెరువు నీటి నిల్వ సామర్థ్యం పూర్తికావడంతో చెరువు ఎగువ ప్రాంత పొలాలు మునుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు నీటిని దిగువకు విడుదల చేస్తే వరి పంట ముంపుబారి నుంచి బయటపడుతుందని ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



అదుపుతప్పితే అంతే..!

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కాట్రావులపల్లి శివారు సూరంపాలెం వెళ్లేమార్గంలో కల్వర్టు శిథిలస్థితికి చేరడంతో ప్రమాదాన్ని తలపిస్తుంది. గ్రామ శివారు మలుపులో ఉన్న కల్వర్టుపై రెయిలింగ్ లేకపోవడంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. జగ్గంపేట వైపు నుంచి కళాశాలకు వెళ్లే బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిత్యం ఈమార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. చీకటి పడిందంటే ఇక్కడ ఎటువంటి విద్యుత్తు వెలుగులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ప్రమాదకర మలుపులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి కల్వర్టుకు రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



కలువల వెనుక కలత..!

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం ముందు విరబూసిన ఎర్ర కలువలు చూడముచ్చటగా ఉన్నాయి. వీటి వెనుక ఏళ్ల తరబడి వెంటాడుతున్న కలత ఉంది. రక్షిత మంచినీటి ట్యాంకు నుంచి వచ్చే నీటితో వసతిగృహం సమీపంలోని పల్లపు ప్రదేశంలో చిన్న చెరువుగా మారింది. ట్యాంకు నిర్మాణం నుంచి ఈ పరిస్థితి కొనసాగుతుండగా.. నీరు నాచు కట్టి ఏడాది పొడవునా పచ్చగా ఉంటుంది. ఇందులోనే కలువలు పూస్తున్నాయి. కలువలు కనువిందుగా ఉన్నా నీటిలో కప్పల చప్పుళ్లు, దోమలు సమీప వసతిగృహం విద్యార్థులకు ఇబ్బందిగా ఉంది. కాలనీల అభివృద్ధి, రోడ్ల నిర్మాణానికి తగ్గట్టుగా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో సమస్య అలాగే ఉంది.





కాశీలో రోటరాక్ట్ ప్రతినిధులు

రోటరాక్ట్ సమ్మేళనం

తుని, న్యూస్‌టుడే: కాశీలో ఈనెల 27 -29 వరకూ మూడు రోజులు జరుగుతున్న రోటరాక్ట్ సీరిక్ సమ్మిట్‌కు ఉమ్మడి జిల్లా నుంచి అనేక మంది ప్రతినిధులు హాజరయ్యారు. రోటరాక్ట్ 3120 ఆతిథ్యం ఇస్తున్న ఈ సమ్మిట్‌లో విజయనగరం నుంచి విజయవాడ వరకూ ఉన్న 3020 రోటరాక్ట్ క్లబ్‌ల ప్రతినిధులు 19 మంది పాల్గొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పురస్కార ప్రదానం ఉంటాయని క్లబ్ ప్రతినిధి కృష్ణ తెలిపారు.

అంబేడ్కర్ ఆదర్శనీయులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ తరతరాలకు ఆదర్శనీయులని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను అన్నారు. ఎనభై ఏళ్ల కిందట అంబేడ్కర్ ఆంధ్ర రాష్ట్ర పర్యటనను గుర్తు చేసుకుంటూ ప్రత్తిపాడులోని ఆయన విగ్రహానికి పీసీసీ సభ్యుడి ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేశారు.



పూలమాల వేస్తున్న పీసీసీ సభ్యుడు శ్రీను

ప్రగతి కళాశాలలో రక్తదాన శిబిరం

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కళాశాల ఛైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రగతి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, కాకినాడ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 95 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు తెలిపారు. వైస్ ఛైర్మన్ సతీష్, ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర టెన్నీకాయిట్ పోటీలకు ఎంపిక

తొండంగి, న్యూస్‌టుడే: అండర్ 14 విభాగంలో జిల్లా స్థాయి టెన్నీ కాయిట్ పోటీలు గురువారం కాకినాడలో జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచి తొండంగి మండలం వాకదారిపేట కస్తూర్బా విద్యాలయం ఎనిమిదో తరగతి విద్యార్థిని వై.గ్లోరీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎస్.శైలజ తెలిపారు. ప్రిన్సిపల్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు గ్లోరీని అభినందించారు.



వై.గ్లోరీ

హాకీలో హరీష్ ప్రతిభ

తొండంగి, న్యూస్‌టుడే: అండర్ 16 విభాగంలో జిల్లా స్థాయి హాకీ పోటీల్లో బెండపూడి జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి డి.హరీష్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. అండర్ 14 విభాగంలో జిల్లా స్థాయి హాకీ పోటీల్లో ఇదే పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి వై.రాకేష్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం నాగం కృష్ణమూర్తి తెలిపారు

రాష్ట్రస్థాయి క్రీడలకు బయల్దేరిన విద్యార్థులు

తుని, న్యూస్‌టుడే: గుంటూరులో ఈనెల 28 నుంచి 30 వరకూ జరిగే అండర్ - 17 ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి బాల, బాలికల జట్లు శుక్రవారం బయల్దేరాయి. ప్రతి జట్టులో 18 మంది చొప్పున విద్యార్థులు ఈ పోటీలకు ఎంపికయ్యారు. తుని జడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి ముగ్గురు క్రీడాకారిణులు జిల్లా జట్టులో ఆడుతున్నట్లు పీడీ మాలిని తెలిపారు..

అవీ ఇవీ అన్నీ

● ధర్మవరంలో స్వచ్ఛతా హీ సేవ

ప్రత్తిపాడు: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ధర్మవరం గ్రామంలో శుక్రవారం గ్రామ సభ జరిగింది. సర్పంచి బెంతుకుర్తి సుశీల అధ్యక్షతన జరిగిన సభలో గ్రామాభివృద్ధికి సూచనలు స్వీకరించారు. నాయకులు బొల్లు కొండబాబు, అప్పనబాబు, అబ్బాయి, ఊటా వీరబాబు పాల్గొన్నారు.

● 30న కౌన్సిల్ సమావేశం

తుని: పలు అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై చర్చించేందుకు 30న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు పురపాలక కమిషనర్ ఎ.వెంకట్రావు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

● భారత్‌కో జానో క్విజ్ పోటీలు

తుని పట్టణం: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో 'భారత్‌కో జానో' క్విజ్ పోటీలు శుక్రవారం జరిగాయి. పట్టణంలోని బ్యాంకుకాలనీలో ఉన్న శ్రీసరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భావిప ప్రతినిధులు మంతెన సూర్యనారాయణరాజు, లక్ష్మణాచార్యులు, ఆసిన సత్యనారాయణ, శంకర్, డేనియల్ జోసెఫ్, చదరం శివాజీ తదితరులు పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

ఏలేశ్వరం: ఏలేశ్వరంలో శుక్రవారం పట్టణ, గ్రామీణ మండలానికి చెందిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకుల విస్తృత సమావేశం జరిగింది. నాయకులు కుప్పల నాగభూషణం, తొర్లపాటి బాబుబు, బుంగా సతీష్, వసంత యోహాన్, జి.కొండబాబు, నూకతాటి సతీష్, బి.శ్రీనివాస్, ఆర్.నూకరాజు తదితరులు హాజరయ్యారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. 29న ఆదివారం సమావేశమవుదామని నిర్ణయించారు.

● ఉచిత శిబిరంలో కంటి పరీక్షలు

తుని: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంలో 176 మందికి పరీక్షలు చేశారు. రోటరీహాల్లో శుక్రవారం ఈ శిబిరంలో పాయకరావుపేట హైమా నేత్రాలయం వైద్యుడు ప్రసాద్, సిబ్బంది 46 మందికి కంటి శుక్లాల శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని నిర్ధారించి ఆసుపత్రికి తరలించారు. క్లబ్ తరఫున 80 మందికి కళ్లజోళ్లు, మందులు అందించారు. డా.అల్లు హరికృష్ణ, క్లబ్ అధ్యక్షుడు చల్లా మంగరాజు, కార్యదర్శి వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

జనం సొమ్ము.. సర్వే రాళ్లపాలు
● వినియోగంపై సందిగ్ధత

న్యూస్‌టుడే, తుని గ్రామీణం

రైతుల పొలాలను సమగ్రంగా సర్వే నిర్వహించి సరిహద్దులు గుర్తించేందుకు వేసే రాళ్లపై జగనన్న పేరు.. ఆ సర్వే అనంతరం ఇచ్చే పట్టాదారు పాసుపుస్తకంపై జగనన్న చిత్రం..ఇలా మాజీ ముఖ్యమంత్రి తన పేరును శిలాశాసనంగా మార్చుకొని రూ.లక్షల ప్రజాధనం నేడు రాళ్లపాలు చేయడం శోచనీయం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూసర్వే పనులు నిలిచాయి. ఆ సర్వే రాళ్లు గ్రామాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

నిలిచిన భూసర్వే..

తుని మండల పరిధిలోని 11 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ సమగ్ర భూసర్వేలో భాగంగా కేవలం అయిదు రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న పేరుతో ఉన్న సర్వేరాళ్లను వేశారు. మిగిలిన ఆరు రెవెన్యూ గ్రామాల్లో భూసర్వే చేయకముందే ప్రభుత్వ నిధులతో సిద్ధం చేసిన సర్వే రాళ్లను ఆయా గ్రామాలకు సరఫరా చేశారు. ఆరు రెవెన్యూ గ్రామాల్లో సుమారు రూ.40 లక్షలు విలువ చేసే 8 వేలకు పైబడి సర్వే రాళ్లను గ్రామాలకు సరఫరా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఆపై సర్వే పనులు నిలిచిపోయాయి. దీంతో సరిహద్దు రాళ్లు గ్రామాల్లో నిరుపయోగంగా పడిఉన్నాయి. నేటికీ వీటి వినియోగంపై సందిగ్ధత నెలకొంది.



దొండవాకలో నిరుపయోగంగా సర్వే రాళ్లు ఇలా.., జగనన్న భూసురక్ష పేరుతో ఉన్న సరిహద్దు రాయి

ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు

భూసర్వే ప్రక్రియ ప్రస్తుతం నిలిచింది. దీంతో పలు గ్రామాల్లో రాళ్లు ఎక్కడికక్కడ పడి ఉన్నాయి. వీటి వినియోగంపై ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు చేపడతాం. - **దేవుడు, సర్వేయరు, తుని**

నిండుకుండలా జలాశయం

తుని, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో విరివిగా వర్షాలు కురుస్తుండటంతో అనకాపల్లి జిల్లా నాతవరం తాండవ జలాశయం నిండుకుండలా మారింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 378 అడుగులకు చేరింది. క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురుస్తుండటంతో 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 555 క్యూసెక్కులు కాలువలకు నీటి విడుదల చేస్తున్నామని రిజర్వాయర్ డీఈ పి.అనురాధ 'న్యూస్‌టుడే'కు శుక్రవారం తెలిపారు. ఇదిలావుండగా తాండవ నది పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో నదిలో వరద ఉద్ధృతి పెరిగింది. పట్టణంలోని భూమి, ముఠా ఆనకట్టల నుంచి వరద నీరు భారీగా ప్రవహిస్తూ పెంటకోట వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది.



జలకళతో తాండవ రిజర్వాయర్

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

గండేపల్లి,న్యూస్‌టుడే: అదృశ్యమైన బాలికను పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ యల్లమిల్లి గ్రామానికి చెందిన బాలిక అదృశ్యంపై తల్లిదండ్రుల ఫిర్యాదుపై 23న కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలికను తీసుకువచ్చి శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన కేసులో జైలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ప్రత్తిపాడు జేఎఫ్‌సీఎం కోర్టు ఏడుగురికి శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో పలుచోట్ల సీఐ సూర్య అప్పారావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా ఏడుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారని, వీరిని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. నిందితుల్లో నలుగురికి 3 రోజుల చొప్పున జైలు, మరో ముగ్గురికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ జి.బుల్లెమ్మ తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

శంఖవరం: కత్తిపూడి జాతీయ రహదారిపై గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అదుపులోకి తీసుకున్నామని అన్నవరం అదనపు ఎస్సై ప్రసాద్ తెలిపారు. కత్తిపూడికి చెందిన పి.జోగిందర్, తమ్మయ్యపేటకు చెందిన బి.నూకరాజు (మరిడయ్య)లను 4.2 కిలోల గంజాయి తరలిస్తుండగా కత్తిపూడి శివారు పోలవరం కాలువ వద్ద పట్టుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.